కథ

# కథా మంజరి

పది  కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**ఆగస్టు 2020 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari

# కథా మంజరి

## ఆగస్టు సంచిక కు

# సుస్వాగతం



# ఇంకా మా జట్టు



సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు



# 'కథా'కీయం!

'అనగా అనగా..' అంటూ సరిగ్గా మాటలు కూడా రాని వయసులోనే కథలు మన జీవితాల్లోకి ప్రవేశిస్తాయి. పిల్లల చేత నాలుగు గోరు ముద్దలు తినిపించడానికి చందమామ పాటలు పాడతారు,  నిద్ర పుచ్చడానికి జోలపాటలు ఉపయోగపడతాయి. అవి మూడు నాలుగేళ్ల వయసు వరకే.. తర్వాత  అవి మూలపడి, కథలే జీవితాన్ని నడిపిస్తాయి.

ఆ తర్వాత ఎదిగే పిల్లలకి, ప్రాధమిక స్థాయిలో విద్యాబోధన చేసేటప్పుడు కథలని వాడుకుంటూ పాఠ్యాంశాలను బోధిస్తే, అవి సులువుగా అర్ధమవుతాయని పరిశోధనలు చెపుతున్నాయి. వాటికి నిదర్శనం ఒకప్పటి విద్యావిధానం! ప్రాధమిక పాఠశాలలో వారానికి ఓ రోజు తప్పనిసరిగా కథలే చెప్పేవారు. రోజు పాఠాలతో పాటు చిన్న చిన్న నీతి కథలు కూడా సందర్భానుసారంగా  వచ్చేవి. ఆ తర్వాత  హైస్కూలు స్థాయిలో ఉపాధ్యాయులు పాఠాలు ఆసక్తికరంగా బోధ పరచడానికి పిట్టకథలు చెప్పేవారు. కథతో పాటు ఆ పాఠ్యాంశం గుర్తుండిపోయేది. కాలేజీ స్థాయిలో కూడా పాఠాలు ఆకట్టుకోడానికి కథల్ని అవసరం మేరా వాడుకునేవారు. అలాగే..  మన తెలుగు సంస్కృతికి  ప్రతీకలని మనం గర్వంగా చెప్పుకునే మన ప్రాచీన కళారూపాలు.. హరికథ, బుర్రకథ, వీధి భాగవతం.. లలో కూడా 'పిట్టకథ'ల తోనే వాటిని రక్తి కట్టిస్తారు.

ఇక.. ఆధునిక భాష అడుగు పెట్టిన తర్వాత మానవ జీవితాలని 'కథ' ఇంకా బాగా ప్రభావితం చేసింది. నవరసాల్లో కథా సాహిత్యం వెల్లివిరిసింది. మన జీవితాల్లో ఓ అంతర్భాగమై అవతరించింది.

అలా మనం మన నిత్యజీవనాల్లోకి వస్తే, బోలెడన్ని కథలు చోటు చేసుకుంటాయి. ఇంటి కథలు, ఆఫీసు కథలు, వీధుల్లో కథలు, భర్తల కథలు, భార్యల కథలు, భార్యాభర్తల కథలు, చుట్టాల కథలు,  పక్కవాళ్ళ కథలు, ఊర్లోవాళ్ల కథలు.. ఇలా ఒకటేవిటి.. సవాలక్ష కథలు ఉన్నాయి. 'రోజు మీ కథలు వినలేక చచ్చిపోతున్నాను' అంటూ కథల మీద కోపాలు చూస్తుంటాం. 'ఓసోస్.. ఆ కతలు నా దగ్గర సెప్పమాకు!' అంటూ రావు గోపాలరావు గార్ల దగ్గర కథలు వింటాం.  'ఏవో కథలు చెప్పి ప్రమోషన్లు కొట్టేసాడు!' అనే గుసగుస కథలు వింటూంటాం.  'ఆ కథాపి అసలు విషయం చెప్పు!' అంటూ కోపంగా కథల్ని ఆపాలనే ప్రయత్నాలు చేస్తూంటాం. 'మీ కథలు ఎవడికి కావాలీ.. ముందు మా కథ సంగతి చూడండి!' అంటూ గదమాయింపు కథలు వింటూంటాం. అలా కథలు రూపాంతరాలు చెంది, కథలు చెప్పడం కూడా ఓ 'కళ'గా మనతో సహజీవనం సాగిస్తున్నాయి.

'మహాప్రభో.. ఆ విషయం చెప్పడానికి ఇంత కథ అవసరమా?' అని మీరంటే.. నా కథని కంచికి, ఈ నెల కథల్ని మీ ముంగిటికి.. స్వీకరించండి!!!

# ఈ నెల విశిష్ట అతిథి

# శ్రీ పి. వి. ఆర్. శివకుమార్



'పరీక్షలు దగ్గర పెట్టుకుని, ఆ పుస్తకాలు చదువుతావేమిట్రా... !' అంటూ వారపత్రికలు చదివే పిల్లల్ని పెద్దలు దండించే రోజులవి. అయినా సరే, కనబడిన పుస్తకాలని ఏదో విధంగా చదివి తీరాలన్న కోరిక పది సంవత్సరాల వయసులోనే వచ్చి, వారపత్రికల్లో కథలను,నవలలను చదివి, పద్నాలుగో ఏటనే కథలు రాయలనే ఆలోచనలకి అక్షర రూపం ఇచ్చిన బాల రచయిత శ్రీ పి.వి.ఆర్ శివకుమార్ గారు. దాదాపు రెండువందల ఏభై కథలు, తొమ్మిది నవలలు, ధారావాహిక నవలలు, నాటికలు, రేడియో ప్రసంగాలు... ఇలా అన్ని ప్రక్రియల్లో తన రచనా పటిమతో తెలుగు పాఠకలోకానికి చిరపరిచితులే.

అసలు అంత చిన్ని వయసులో ఆయనలో స్ఫూర్తి కలిగించినవి... రెండు ధారావాహిక నవలలట. అందుకే వాటి రచయితల మీద ఈ రోజుకి అమితమైన గౌరవం ఆయనకి. ఇంతకీ ఆ ఇద్దరు ఎవరంటే... 'ధృవతార' రచయిత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారు, 'చక్ర భ్రమణం' రచయిత్రి శ్రీమతి కోడూరి కౌసల్యాదేవి గారు. అలా పద్నాలుగో ఏటనే... అంటే 1965 లో ఆయన రాసిన పిల్లల నాటిక 'బాలబంధు' అనే పిల్లల పక్షపత్రికలో ముద్రితం అయింది. అలా మొదలైన శ్రీ శివకుమార్ గారి రచనా ప్రస్థానం, కాలేజీలో చదువుతున్నప్పుడే, వారి కథలు చందమామ, జ్యోతి మాసపత్రిక వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురితమయే స్థాయికి చేరింది. మెకానికల్ ఇంజనీరుగా ఎచ్.ఎం.టి.లో ఉద్యోగం చేస్తూనే, కలం ఝుళిపించిన వీరి మీద, విచిత్రంగా మరో ఇద్దరు ప్రముఖ రచయితల ప్రభావం ఉందని కూడా ఆయనే హాయిగా చెబుతూ ఉంటారు. ఆ రచయితల రచనలు వేరు వేరు కోణాలలో ఉంటాయి. ఒకరు ముళ్లపూడి వెంకటరమణ గారైతే, మరొకరు ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారు. అందుకేనేమో... వీరి రచనల్లో హాస్యరసం వుంటుంది, కుండ బద్దలు కొట్టే నిజాయితీ ఉంటుంది. అలనాటి ఆంధ్రపత్రిక నుండి నేటి స్వాతి వారపత్రిక వరకు నిర్వహించిన కథల పోటీలలో బహుమతులు పొందిన వీరి కథలు ఒకే మూసలో ఉండవు. సెంటిమెంట్లు, కామెడీ, సాహసం, పాత కొత్త కుటుంబ కథలు రాయడంలో వీరికి వీరే సాటి. వీటితో తన రచనా వ్యాసంగాన్ని సరిపెట్టలేదు. ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రం ద్వారా శ్రీ శివకుమార్ గారి నాటికలు, కథలు, పూలజల్లు వంటి కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. ఈనాడు దినపత్రికలో టూకీగా శీర్షిక, ఇతర వ్యాసాలు, సితారలో సినీ వ్యాసాలు, శీర్షికలు, విపులలో వివిధ భాషల అనువాద కథలు చెడామడా రాసారు. పెన్ను, కాగితాలు అనునిత్యం వెంటుంటేనే గాని ఇలాంటి రచనా విన్యాసాలు చేయడం కష్టమైన పనని మనం అనుకుంటుంటే... 'ఆనందాన్ని ఇచ్చే అంశం కదా, అంచేత దినచర్యలో ఓ భాగంగా ఎక్కడో అక్కడ ఇరికించడమే!' అంటూ నవ్వుతూ అంటారీ ఇంజనీరు గారు. వీరి అమ్మాయి, అల్లుడు అస్ట్రేలియాలో ఉంటే, శ్రీ శివకుమార్ గారు, వారి శ్రీమతి వరలక్ష్మి గారు తమ అబ్బాయి, కోడలు, మనుమడితో ముంబైలో ఉంటున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ అనంతరం ఓ ప్రైవేటు కంపెనీలో జనరల్ మేనేజర్ గా సేవలు అందిస్తూనే ఉన్నారు.

క్రికెట్ అంటే ఇష్టం. పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. స్నేహితులంటే ఇష్టం. పాత పాటలంటే ఇష్టం. అన్నింటినీ మించి తనకు మంచి బాల్యాన్ని ఇచ్చిన విజయవాడ అంటే మరీ ఇష్టం.

మా అభ్యర్థనని మన్నించి, ఎంత బిజీగా ఉన్నా సరే, ఈ నెల కథల ఎంపిక చేయడానికి, తమ అమూల్యమైన సమయాన్ని వినియోగించి సహకరించిన శ్రీ పిన్నలి వెంకట రామ శివకుమార్ గారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!'



# కథా మార్గదర్శి



తెలుగు కథలు అనగానే మనకి ఎంతోమంది ప్రముఖ రచయితలు స్ఫురిస్తారు. వారి రచనలు విడవకుండా చదివే అభిమానులూ ఎంతోమంది ఉంటారు. వారి రచనలు చదివి, వాటిని స్ఫూర్తిగా తీసుకుని రచనలు చేసి, రచయితలుగా రూపుదిద్దుకున్న వారినీ చూస్తూనే ఉంటాం. నిన్నటి తరంలో అలా ఎంతోమంది పాఠకాభిమానులను పొందిన స్ఫూర్తి ప్రదాత, ఎంతోమంది తెలుగు రచయితలకు మార్గదర్శిగా కీర్తికెక్కిన సుప్రసిద్ధ కథా రచయిత కీ.శే. పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారిని, ఈ నెల 'కథా మార్గదర్శి' గా తలుచుకోడానికి ఆనందిస్తున్నాం. ఈ నెల మన విశిష్ట అతిథి శ్రీ పి.వి.ఆర్. శివకుమార్ గారు కూడా వారిని అభిమానించి, వారి రచనల స్ఫూర్తితోనే కథలు రాయడం ఆరంభించారు. సుబ్బరామయ్య గారి గురించి, శివకుమార్ గారి మాటల్లో చెప్పాలంటే....

"పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు (1938-2018) ప్రచారం, ఆర్భాటాలకు దూరంగా మెసలిన సుప్రసిద్ధ రచయిత. తెలుగులో కథానికా విభాగం లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్న అతి కొద్దిమందిలో సుబ్బరామయ్యగారు ఒకరు. చిన్న వయసులోనే కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి ఉద్దండుడి ప్రాపకం దొరకటం ఆయనకి లభించిన వరం!

తన వృత్తి జీవితాన్నంతా విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో తెలుగు బోధిస్తూ గడిపిన ఈ ప్రఖ్యాత రచయిత అలనాటి భారతి మొదలుకొని వివిధ పత్రికలలో మూడు వందల దాకా కథలు, సుమారు పన్నెండు నవలలు రాశారు. తన రచనలకి పత్రికల పోటీలలో బహుమతులతో పాటు అనేక గౌరవాలు, విమర్శకుల ప్రశంసలూ పొందారు.

సుబ్బరామయ్య కథలు మధ్యతరగతి మనుషుల జీవితాలలోని కనిపించని విషాదాన్నీ, దిగువ తరగతి మనుషుల దైనందిన వ్యధలనీ వల వేసి పట్టి, వాస్తవికతకి అంగుళం కూడా అటూ,ఇటూ బెసగకుండా, యధాతథంగా కలం కన్నుతో దృశ్యీకరిస్తాయి. అయితే, ఆ సాధారణ జీవితాలలోని అసాధారణ పార్శ్వాలని ఆయన స్పృశించే తీరు మనల్ని నివ్వెరపరుస్తుంది.

ఆ అసాధారణ పార్శ్వాలు, ఆ జీవితం లోని లేదా ఆ సన్నివేశం లోని విషాదాన్నీ, నిస్సహాయతనో అకస్మాత్తుగా మన కళ్ళ ముందు నిలిపి, మనని విభ్రాంతిలోకీ, పరిష్కారం స్ఫురించని అయోమయంలోకీ నెట్టి, మననొక అవ్యక్తమైన అలజడికి గురిచేస్తాయి.

మనిషి మనసు అనంతమైన కోరికల పుట్ట. ఎన్నటికీ అంతం కాని ఆ కోరికలే సమాజంలో మన చుట్టూ ఉన్న మనుషుల్లో అంతర్లీనంగా అసంతృప్తి రగిలిస్తూనే ఉంటాయి. వాటికి ఉన్నవాడు, లేనివాడన్న తేడా లేదు. లేని వాడికి లేదనీ, ఉన్నవాడికి చాలినంత లేదనీ! ఈ అసంతృప్తి అనేకానేక సంఘటనలకీ, జీవిత మలుపులకీ మూలకారణం. యోచించగలిగిన వాడికి, "ఈ అసంతృప్తి అద్భుతమైన కథావస్తువు" అంటారాయన. భాషాడంబరం లేని సరళమైన శైలి ఆయన పథం.

ఆయన రాసిన ముసురు, నీళ్ళు, ఇంగువ వంటి ఎన్నో మంచి కథలనుంచి, ఈ “ఇరవై అయిదవ గంట” నేను ఎంచుకోవటానికి కారణం, ఈనాటి డి. టి. పి. యుగంలో పెరుగుతున్న ఔత్సాహిక రచయితలకి ఈ కథా వాతావరణం పరిచయం చేయాలనే. కంప్యూటర్లు వచ్చి టైప్ రైటింగ్ ని సులభతరం చేసినట్టే, డి.టి.పి. సెట్టింగ్ వచ్చాక, చేత్తో పేర్చే ఆ సీసపు ముద్దల అక్షరాలూ, పేజి సెట్టింగుల ఫ్రేములూ, పేజి సెట్టింగ్ లోని అనంత కష్టాలూ, కళ్ళలో వత్తులు వేసుకు నానా శ్రమా పడుతూ చేయవలసిన ప్రూఫ్ దిద్దుళ్ళూ, ట్రెడిల్ అచ్చు యంత్రాలూ, క్రమంగా మాయమై పోయాయి. పాత తరం రచయితలు కొద్దిమంది అయినా ఇంకా చేతితో, కాగితాలమీద కథలు, నవలలు రాస్తున్నారంటే, ఈ తరం రచయితలు విస్తుపోవటం చూస్తున్నాం. డిజిటల్ పత్రికలవారు తమ డి టి పి., ప్రూఫ్ రీడింగ్ శ్రమని గూడా గడుసుగా రచయితలమీద పెట్టి వేయటమూ చూస్తున్నాం.

ఇటువంటి యుగం లో, ఆనాటి పరిస్థితిని ప్రతిబింబించిన ఈ కథ మీద నేను ప్రత్యేకించి సమీక్ష చేయటం అనవసరం అనుకుంటున్నాను. చదివిన ప్రతి వారికీ కథ తనను తాను విశ్లేషించుకుని ప్రదర్శితమౌతుంది."

* * *

# ఇదీ వరస


| క్రమ సంఖ్య | రచన | రచయిత<br>శ్రీ / శ్రీమతి / కుమారి | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1 | కారే రాజులు | వసుంధర | 1 |
| 2 | తరుచ్ఛాయ | కలవల గిరిజా రాణి | 13 |
| 3 | రాగధ్వని | పక్కి శివ ప్రసాద్ | 25 |
| 4 | గతి తర్కం | సునీత పోతూరి | 31 |
| 5 | అర్రరే | బాడిస హనుమంతరావు | 34 |
| 6 | స్నేహ | అంగర వెంకట శివ ప్రసాద రావు | 38 |
| 7 | పాత సైకిల్ | దుర్గం భైతి | 41 |
| 8 | హై వే | యల్లాప్రగడ సంధ్య | 45 |
| 9 | ఇల్లాలి ఉత్తరం | కె వి యస్ రవి | 49 |
| 10 | ఎల్లలు లేని మనసు | పి ఎల్ ఎన్ మంగ రత్నం | 51 |

మొదటి బహుమతి

# కారే రాజులు ....

## వసుంధర





# కారే రాజులు.....

## వసుంధర

కారు హైదరాబాదు పొలిమేరలు దాటింది. మామూలుగా ఐతే ఎంత దూరమొచ్చేమని చూసేవాణ్ణి.

ఈ రోజలా కాదు. కారు టైంమెషీన్లా అనిపిస్తోంది. కాలంలో వెనక్కి వెడుతున్నామనిపిస్తోంది. అలా చూస్తే, పొలిమేరలు దాటడమేమిటి – అప్పుడే పది పన్నెండు సంవత్సరాలు వెనక్కి వెళ్లామా అనిపించేలా ఉన్నాయి పరిసరాలు.

అదే మా ఊరెడితే డెబ్బై ఏళ్లు వెనక్కెడతామంది పద్దెనిమిదేళ్ల నా కూతురు సుభద్ర – ఎకసక్కెంగా కాదు, ఎక్సయిట్మెంటుతో!

సుభద్ర, వాళ్లమ్మ వెనుక సీట్లో ఉన్నారు. ముందు నేను, డ్రైవరు శివుడు.

“ఈ రోజు ఏదో జరుగుతుంది” అంటోంది మనసు.

నా మనసప్పుడు క్రికెట్ మ్యాచ్ చూస్తున్నంత ఉద్వేగంలో ఉంది. ఆట చివరి ఓవర్లో చివరి బంతి. మన జట్టు నెగ్గడానికి ఐదు పరుగులు కావాలి. సిక్సర్ కొడితే జయం మనది. ఫోర్ కొడితే మ్యాచి టై ఔతుంది. పెద్ద షాట్ కొట్టలేకపోతే – మనకి ఓటమి.

ఏం జరుగుతుంది?

నా ఆలోచనలకు బ్రేకు వేస్తూ, “నాన్నా! ఈ ఫోటోలో ఉన్నదెవరో చెప్పుకో” అంటూ ఓ ఫొటో అందించింది సుభద్ర.

చూస్తే – అందులో పద్దెనిమిదేళ్ల అమ్మాయి. అచ్చం సుభద్ర లాగే ఉంది. ఉండడమేమిటీ- సుభద్రే! కానీ అది రంగుల ఫొటో కాదు. తెలుపు నలుపుల్లో ఉంది. వెనకాల హంగులు కూడా ఇప్పటివి కాదు, పాత కాలానివి.

నేనింకా ఆలోచిస్తుంటే, “గుర్తు పట్టలేదు కదూ – పోనీ ఇది చూడు. క్లూ దొరుకుతుందేమో!” నవ్వుతూ ఇంకో ఫొటో ఇచ్చింది.

చూస్తే అది నా ఫొటో. ఓ పల్లెటూళ్లో మామిడి తోట మధ్యలో ఓ మామిడి చెట్టు కింద నిలబడి నవ్వుతున్నాను.

నేనెంత బాగున్నానో! నా నవ్వెంత బాగుందో! కానీ – అలా తోటలో ఫొటో ఒకటి తీసుకున్న గుర్తు లేదు నాకు. అదీ కాక – ఈ ఫొటో కూడా తెలుపు నలుపుల్లోనే ఉంది.

"చూసేవా – రంగుల ప్రపంచం నుంచి బయటపడితే – నిన్ను నువ్వే గుర్తు పట్టలేకపోతున్నావ్" నవ్వింది సుభద్ర.

అప్పుడు వెలిగింది నాకు. ఇదంతా సుభద్ర మాయ! చిన్నప్పట్నించీ దానికి పాత అంటే మహా మోజు. పాత నాణేలు, తపాలా బిళ్లలు సేకరిస్తుంది. పాత ఆచారాల్ని అభిమానిస్తుంది. పాత సినిమాలు ఇష్టపడుతుంది. పాత సాహిత్యాన్ని మెచ్చుకుంటుంది. ఈ మధ్యనే మా కుటుంబానికి సంబంధించిన పాతకాలపు తెలుపు, నలుపుల ఫొటోల్ని సేకరించే కార్యక్రమంలో పడింది. దానికా ఫొటోలు ఎంత నచ్చాయంటే – తాజాగా తీసుకున్న రంగుల ఫొటోల్ని పాత ఫొటోల్లా మార్చడం మొదలెట్టింది.

ఈ కంప్యూటరు యుగంలో సాధ్యం కానిదేముంది – అందులోనూ కంప్యూటరు ఇంజనీరింగు చదివే అమ్మాయికి!

"ప్రపంచమంతా ముందుకు దూసుకుపోతుంటే – నువ్వేమిటే – కాలాన్ని వెనక్కి తిప్పుతున్నావ్" ముచ్చటగా కసిరాను.

"కాలం మాటెందుకూ – మనం రంగుల్లో బాగున్నామా, తెలుపు నలుపుల్లో బాగున్నామా, అది చెప్పు" అంది సుభద్ర.

ఇప్పుడది ఇచ్చిన ఫొటోలు పాతవాటి కంటే మనోహరంగా ఉన్నాయి. కానీ ఆ నిజం చెబితే – అమ్మో కొంప మునిగిపోదూ...

"ఏది బాగున్నా, ఓ విషయం గుర్తుంచుకో! ఫొటోలు వాస్తవాన్ని చెప్పవు. గతమెప్పుడూ భూతం లాంటిది. అందుకే దాన్ని భూతకాలం అన్నారు. వర్తమానంలో దాన్ని విస్మరించకపోతే, అది భవిష్యత్తుని కూడా భూతం చేస్తుంది" అని మందలించాను.

"ఔను. గతమంటే అమ్మా నాన్నా. ఇప్పటివాళ్లు కన్నవాళ్లని భూతాల్లా భావిస్తూ, ఆశ్రమాలకు తరలించి, తమ భవిష్యత్తుని భూతం కాకుండా కాపాడుకుంటున్నారు. కదూ నాన్నా!" అంది సుభద్ర.

చురుకుతనంలో సుభద్రది మా బామ్మ పోలిక. దాని ముందు నేనెక్కడ ఆగగలను? నేనేదో మెత్తగా మందలిస్తే – అది తన సమాధానంతో ఛెళ్లుమనిపించింది. అలాగని నేను నా వాళ్లనెవర్నీ దూరం పెట్టలేదు. ఇంకా చెప్పాలంటే, వాళ్లని దగ్గర చేసుకుందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. కానీ గతాన్ని భూతంతో పోల్చడం ఎంత తప్పో – ఛెళ్లుమనేలా చెప్పింది సుభద్ర!

తమాయించుకుని, “ఐతే ఏమంటావ్? మనమిప్పుడు భూతాన్నే భవిష్యత్తు చేసుకుందామంటావా?” అన్నాను.

“చేసుకోవడమేమిటి నాన్నా! జీవాత్మా పరమాత్మల్లా – భూతమూ భావీ కూడా అద్వైతం. అంటే భూతమే భవిష్యత్తు, భవిష్యత్తే భూతం. ఈ విషయం నీకు నేను చెప్పాలా?” అని ఓ క్షణమాగి ఓ పద్యం అందుకుంది సుభద్ర.

‘కారే రాజులు? రాజ్యముల్ కలుగవే? గర్వోన్నతిన్ బొందరే?

వారేరీ? సిరి మూటకట్టుకొని పోవంజాలిరే? భూమిపై

పేరైనం గలదే? శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై

ఈరే కోర్కెలు? వారలన్ మరచిరే ఇక్కాలమున్ భార్గవా!’

మా మాటలు శివుడు కూడా వింటున్నట్లున్నాడు, “పద్యం పోతనగారిది కదమ్మా, చాలా బాగా పాడేవ్” అన్నాడు.

ఇదే పద్యాన్ని సుభద్ర నాలుగు రోజుల క్రితం కూడా నాకు ఇంత బాగానూ చదివి వినిపించింది.

వామనుడికి మూడడుగులు దానంగా ఇవ్వబోతున్న తనని వారించిన గురువు శుక్రాచార్యుడికి సమాధానంగా బలి చక్రవర్తి అన్న మాటల్ని సామాన్య జనం కూడా ఇప్పటికీ గుర్తుంచుకునేలా చెప్పాడు పోతనామాత్యుడు. కానీ ఇలాంటి వేదాంతాన్ని పాతకాలపు పనికిరాని పరిజ్ఞానంగా కొట్టిపారేస్తాను నేను. సుభద్రకి మాత్రం సాహిత్యంలో వేదాంత గ్రంథాలూ ఇష్టమే. చదువులో ఎప్పుడూ వేలెత్తి చూపించుకోలేదు కాబట్టి హాబీల విషయంలో దాన్ని నేను హెచ్చరించలేదు. కానీ అప్పుడు ఇంకా బొడ్డూడని ఓ పిల్ల శంకరాచార్య లెవెల్లో నాకు అద్వైతాన్ని బోధిస్తుంటే ఉక్రోషమొచ్చి, “సరే, ఐతే టైం మెషీన్ తీసుకురా. అశోకుడి కాలానికి వెళ్లిపోదాం” అన్నాను.

సుభద్ర చలించలేదు, “అశోకుడి కాలమంటే అది చరిత్ర. దాని గురించి ఎవరికిష్టమైనది వాళ్లు రాసి అదే నిజమంటున్నారు. నిజానిజాలు పూర్తిగా తెలియవు కాబట్టి, మరీ అంత దూరమొద్దు. ఖచ్చితంగా తెలిసిన 1950 ల్లోకి వెడదాం” అంది సుభద్ర.

“సరే, అలాగే వెడదాం. ముందు టైంమెషీన్ తయారు చెయ్” అన్నాను వేళాకోళంగా. కానీ అది వెంటనే, “టైం మెషీన్ రెడీ. దానికి డ్రైవరు కూడా రెడీ. ఇక నువ్వు ఊఁ అనడమే తరవాయి” అంది.

అంత వెంటనే అనేసరికి - ఏదో తమాషాకి అందనుకుని, “ఎవరా డ్రైవరు?” అన్నాను నవ్వేస్తూ.

"ఇంకెవరూ, మన శివుడే" అంది సుభద్ర.

శివుడు అద్దె కార్లు నడిపే డ్రైవరు. ఐదారేళ్లుగా మాకు తెలుసు.  నాలుగు నెల్ల క్రితం స్వంతంగా కారు కొనడానికి, లోనుకి ష్యూరిటీగా ఉన్నానన్న గౌరవంతో మేమెప్పుడడిగినా కారు తీసుకొస్తాడు. మేమూ ఊరికే స్వారీ చెయ్యం. అందరు క్లయంట్లలాగే పే చేస్తాం. ఎటొచ్చీ మిగతా కార్లలో వెడితే అద్దె కార్లో వెడుతున్న ఫీలింగు. శివుడి కార్లో ఐతే స్వంత కారూ డ్రైవరూ అన్న ఫీలింగు. కారు లేని మాకు శివుడి కారో గొప్ప సదుపాయం.

సుభద్ర ప్లానేమిటంటే, మేమంతా శివుడి కార్లో మా ఊరెళ్లాలి. దాంతోనే టైం మెషీన్లో పది పదిహేనేళ్లు వెనక్కెడతాం. అక్కడ మా ఇంటికెడితే ఇక 1950లలోకి వెళ్లినట్లే!

శివుడు డ్రైవరుగా కార్లో పల్లెటూళ్లో మా ఇంటికెళ్లడం ఇదేం మొదటిసారి కాదు. కానీ ఇప్పుడు శివుడి కారుని టైంమెషీన్ అనుకుంటే మాత్రం – నేను భయపడే భూతమూ, భవిష్యత్తూ ఒకటైపోగలరు. ఆ భూతం ఎనభై ఏళ్ల నా బామ్మ సుభద్రమ్మ. భవిష్యత్తు పద్దెనిమిదేళ్ల నా కూతురు సుభద్ర.

నా భయాన్ని కనిపెట్టినట్లుంది – సుభద్ర నవ్వి, "ఈ ట్రిప్పు మనకి చాలా ముఖ్యం నాన్నా! నేను మేజరవగానే తాతమ్మ నన్నోసారి కలుసుకోవాలంది. మర్చిపోయావా?" అంది.

ఎలా మర్చిపోతాను? ఎన్నో ఏళ్లుగా నావల్లకానిది, ఇప్పుడు నా కూతురు ద్వారా సాధించాలని – సుభద్ర మేజరయ్యే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. ఫలితంగానే కదా - ఇప్పుడీ ప్రయాణం......

- - - - -

బామ్మ మామూలుది కాదు. మొహం ముడతలు పడుండొచ్చు కానీ, నాలుగైదు కిలోమీటర్లు ఇట్టే నడిచేస్తుంది. పన్లు చెయ్యడానికి మనుషులున్నా – తన పనులన్నీ తనే చేసుకుంటుంది. తన వంట కూడా తనే చేసుకుంటుంది. అదేంమమ్మా అంటే – నాకంటే బాగా వండగల మనిషి దొరకడం లేదని గర్వంగా చెబుతుంది. పల్లెటూళ్లో ఊరికి మధ్యలో అరెకరం స్థలంలో ఊరికే తలమానికంగా ఉండే పాతకాలపు పెద్ద మండువా ఇంటికి యజమాని. పదెకరాల మాగాణి, మరో పదెకరాల మెట్టపొలం, ఇరవై ఎకరాల బీడు, చెప్పుకోతగ్గ పశుసంపద – వీటికి అధిపతిగా ఉంటూ ఆ ఊళ్లో మహారాణిలా వెలిగిపోతోంది.

బామ్మ ఆస్తికి ఏకైక వారసుణ్ణయిన నేను పట్నంలో కమిషన్ వ్యాపారం చేస్తున్నాను. స్వంతిల్లుంది కానీ మేడ కాదు. కారులో తిరగ్గలను కానీ కొనలేను. కూతుర్ని చదివించగలను కానీ పెద్దింటి సంబంధానికి తగినంత కట్నమిచ్చి పెళ్లి చెయ్యలేను.

బామ్మ తలచుకుంటే – నేను క్షణాలమీద కోటీశ్వరుణ్ణైపోతాను. కానీ బామ్మ నా ఆస్తిని సొమ్ము చేసుకోనివ్వదు. కనీసం ఏటా ఇంతని ఫలం కూడా నాకివ్వదు. సత్యభామ పెరట్లోని పారిజాతం చెట్టు పూసిన పూలన్నీ – రుక్మిణికి దక్కినట్లు – పల్లెటూళ్లోని ఆస్తి ఫలమంతా ఇప్పటికి బామ్మకే దక్కుతోంది. అందుకని బామ్మనీ, ఆవిడతోనే ఉంటున్న అమ్మనీ, నాన్ననీ - నా దగ్గరకొచ్చి ఉండమని రెండు దశాబ్దాలుగా పోరుతున్నాను. కానీ బామ్మ సాగనిస్తుందా, నన్నే తన వద్దకొచ్చి ఉండమంటుంది. తనుండగా ఈ ఆస్తి అమ్మకానికి పెట్టనంటుంది. పెద్దది కదా, ఎన్నాళ్లుంటుందిలే అని సరిపెట్టుకుంటే – తనకిప్పుడు ఎనభైఏళ్లొచ్చాయి. ఇంకా పిడిరాయిలా ఉంది.

అలాగని నేను బామ్మ చావుని కోరుకోవడం లేదు. తనంటే నాకూ ఇష్టమే! ఎటొచ్చీ తన దగ్గరకెళ్లి ఉండేటంత కాదు, తననే నా వద్దకు తెచ్చుకోవాలన్నంత! కానీ బామ్మ మామూలుదా – హస్తినాపురాన్ని కాపాడే భీష్ముడిలా ఎన్నో తరాలుగా ఆ ఆస్తిని అంటిపెట్టుకుని ఉంది.

తాతగారికి ఆవిడ రెండో భార్య. పెద్దావిడకి ఓ కొడుకూ, ఇద్దరు కూతుళ్లూ. తల్లి లేని ఆ పిల్లల్ని కన్నబిడ్డలకంటే ఎక్కువగా సాకింది.  ఆవిడకి ఏకైక సంతానం నాన్న. మిగతావాళ్లంతా అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. నాన్నేమో ఇండియాలోనే ఉండిపోయి, తల్లిని దగ్గరుండి చూసుకోవడానికి జీవితాన్ని త్యాగం చేశాననేవాడు. బామ్మ ఒప్పుకోదు సరికదా, "ఎలాగూ ఇక్కడ వ్యవసాయంలో స్థిరపడ్డావు. పల్లె అంటే ప్రేమ పెంచుకోరా! నా కోసం కాదు, పల్లెను వదల్లేక ఇక్కడున్నానని ఒక్క మాటనరా! నాకు తృప్తిగా ఉంటుంది" అనేది బామ్మ.

బామ్మకి మా ఊరంటే ప్రాణం. మనిషికి అతి ముఖ్యమైనది తిండి అనీ, మిగతావన్నీ కేవలం సరదాలనీ – అందుకని రైతు దేశానికి వెన్నెముక, గ్రామం దేశానికి ఆయువు పట్టు అనీ అంటుంది. 'పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా' అనే వేమన పద్యంలోని పన్నీరు పల్లె అనీ, బురద పట్నం అనీ తేల్చేస్తుంది.

"చదువు రాక, వేరే దారి లేక ఇక్కడుండిపోయానని అన్నా, అక్కలూ అంటున్నారు. కనీసం నువ్వయినా నీకోసం ఇక్కడున్నానని అనుకోవేం?" అని నాన్న నొచ్చుకుంటాడు. దానికి బామ్మ, "ఎలా అనుకుంటావ్రా? నిన్నలా అన్నవాళ్లు చెడ్డవాళ్లేం కాదుగా. ఈ ఆస్తిపాస్తులకి వారసత్వపు హక్కులు వదులుకున్నారు. అప్పుడప్పుడు తృణమో పణమో మనకివ్వడమే తప్ప మననుంచి తీసుకోరు. ఇక్కడికొచ్చినా, ఫోన్లో పలకరించినా - ఆప్యాయంగా, ఆత్మీయంగా అనిపిస్తారు" అని బదులిస్తుంది.

"వారసత్వపు హక్కులు ఉంటే కదా, వదులుకుందుకు! ఈ ఆస్తి నాన్నగారు స్వయంకృషితో సంపాదించింది. ఆయన మొత్తం ఆస్తిని సర్వ హక్కులతో నీ పేరిట వ్రాసేశాడు. ఎవరికైనా సరే, నువ్విస్తే ఇచ్చినట్లు – లేకపోతే లేనట్లు" అంటాడు నాన్న అప్పుడప్పుడు.

దానికి బామ్మ, “వాళ్ల మాటలకు కష్టం తోస్తే, నువ్వూ పట్నం వెళ్లిపో. ఈపాటి వ్యవసాయం నేనూ చెయ్యగలను” అని సవాలు విసిరింది.

చూసుకునేందుకు కమతగాళ్లు, పాలేళ్లు ఉన్నారు. నాన్న పనల్లా కూర్చుని అజమాయిషీ చెయ్యడమే అనుకుంటే అది ఆయన కంటే బామ్మే బాగా చేస్తుంది. అందుకని నాన్న తన కోసం జీవితాన్ని త్యాగం చేశాడని బామ్మ ఒప్పుకోదు.

కడుపులో చల్ల కదలకుండా రోజులు సుఖంగా గడిచిపోతున్నాయి కదా, అందుకని మొదట్లో నాన్నకీ పల్లె అంటే అయిష్టం లేదు. పెళ్లయి అమ్మ కాపురానికి వచ్చినప్పట్నించే ఆయన తన త్యాగాన్ని ప్రస్తావించడం మొదలెట్టాడు. దానికీ బామ్మ ఊరుకోదు.

“నీ పెళ్లాం పట్నంలో పుట్టి పెరిగింది. తనకి సినిమాలిష్టం. హోటళ్లిష్టం. షాపింగులిష్టం. కార్లలో తిరగడం ఇష్టం. ఆ సరదాలిక్కడ తీరవని నిన్ను వేధిస్తోంది. తనకి సమాధానం చెప్పలేక త్యాగం చేశాను, త్యాగం చేశాను అంటున్నావు. ఆత్మరక్షణకోసం నీ పెళ్లానికి ఆ మాట చెప్పుకో. నా దగ్గర మాత్రం త్యాగం అని ఇంకోసారి అనకు” అని హెచ్చరించింది.

ఐతే ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలో తెలిసిన బామ్మ, కోడలి దగ్గర ఇలా అనదు, “మనూళ్లోనూ రెండు హోటళ్లున్నాయి. ఓ సినిమా హాలుంది. ఎక్కడికెళ్లినా కాలు కిందెట్టక్కర్లేకుండా రెండెడ్ల బండుంది. నీ సరదాలకేం లోటుండదు” అంటుంది.

కానీ – పల్లెటూళ్లో పెద్దింటివాళ్లు, ముఖ్యంగా పెద్దింటి ఆడవాళ్లు - హోటలుకెళ్లకూడదు. అంతగా ఐతే టిఫిను ఇంటికి తెప్పించుకోవచ్చు. సినిమా హాలు కెడితే, అక్కడ పెద్దింటివాళ్లకి స్పెషల్ ట్రీట్మెంటు. తాము సినిమా చూస్తుంటే, మిగతావాళ్లు తమని చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఇక రెండెడ్ల బండిలో ప్రయాణమైతే, వళ్లు హూనమైపోతుంది. అంతకంటే కాలి నడక మేలు. మరి పట్నంలో ఐతే ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు. జేబులో డబ్బుండాలి కానీ ఎవరి మానాన వాళ్లు హాయిగా సుఖపడొచ్చు. నేడు పల్లెలు ఆధునికమౌతున్నా కూడా - కొన్ని సరదాలు తీర్చడంలో పల్లె కప్ప అయితే, పట్నం ఎద్దు. రెంటికీపోలికెక్కడ?

ఆ విషయం బామ్మకి మాత్రం తెలియదా? తెలియకపోయినా గట్టిగా చెప్పే దమ్మెవరికుంది? పోనీ అని ఆవిణ్ణి కాదని పట్నం వెళ్లిపోదామనుకుంటే, అప్పుడు అంత ఆస్తినీ కూడా కాదనుకోవాలి.

“ఏం చేస్తాం? ఆవిడ ముందు నోరు మెదపలేని చచ్చు ఘటాలం” అని అమ్మ తరచుగా వాపోయేది.

“అసలు తప్పు మా నాన్నది. తనకూ పట్నంలో మకాం పెట్టాలనుండేది. మా అమ్మ సాగనివ్వలేదు. పట్నమెడితే, మగాళ్లు చెడిపోతారనేది. చెడిపోవాలని సరదా ఉన్నవాళ్లే, పట్నమెడతారనేది. ఐతే ఏం,

మొగుడిగా తన అథార్టీ చూపించి పట్నానికి మారిపోవచ్చుగా. కానీ ఆయన ఊళ్లోనే పులి, అమ్మ దగ్గర పిల్లి. ఆ ఫలితం ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం" అని నాన్న అమ్మ దగ్గర వాపోయేవాడు.

"మన బ్రతుకెలాగూ ఇక్కడే! కనీసం మన పిల్లలకయినా పట్నంలో బ్రతికే అవకాశం రావాలి" అని వాళ్లిద్దరూ అనుకున్నారు.

నేను అమ్మా నాన్నలకి ఒక్కగానొక్క కొడుకుని. అమ్మా నాన్నల ఆశయాన్ని వంటబట్టించుకున్న వాణ్ణి.

అసలు కన్న వడ్డీ ముద్దు కదా – బామ్మ నా సరదాల విషయంలో నాకు కొంత అలుసిచ్చింది. అలా నేను ప్రాథమిక విద్యని మా ఊళ్లోనే ముగించినా, తర్వాత ఇంగ్లీషు మీడియం చదువు కోసం పట్నంలో రెసిడెన్షియల్ స్కూల్లో చేరాను. తొందరలోనే నాకు అర్థమయింది – పల్లెలో నాది నక్క బ్రతుకనీ, పట్నం ఓ నాకలోకమనీ.

ఎటొచ్చీ నాకలోకంలో కూడా విలాసాలు దేవ నాయకులకే. ఋషులైతే అక్కడా తపస్సునే జీవితం చేసుకుంటారు. నాకు మాత్రం చదువులో రాంకుల కోసం తాపత్రయపడే ఋషినవాలని లేదు. ఉద్యోగం పేరుతో యాంత్రిక జీవితాన్ని గడపాలనీ లేదు.

ఆడుతూ పాడుతూ బీకాం చదివాను. అవసరమైన మేరకు కంప్యూటరు పరిజ్ఞానాన్ని సంపాదించాను.

"చదువైపోయిందిగా, ఇక మనూరొచ్చి మాకు చేదోడు వాదోడుగా ఉండు" అంది బామ్మ.

నా భవిష్యత్తు గురించి బామ్మ ఏమాలోచిస్తోందో నాకు అర్థమైపోయింది. "నేను పట్నంలోనే ఉండి, వ్యాపారం చేస్తాను" అన్నాను.

"మరి నాతో ఉండవా?" అంది బామ్మ.

"నేను నీతో కాదు. నువ్వే నాతో ఉంటావు పట్నంలో. నువ్వేమిటి - అమ్మా, నాన్నా కూడా పట్నమొచ్చి నాతోనే ఉంటారు" అన్నాను.

"నేను పట్నానికెందుకొస్తాను? మీరే ఇక్కడికొచ్చి నాతో కలిసుండాలి" అంది బామ్మ దృఢంగా.

"అది నీ ఇష్టం. నేను మాత్రం పట్నంలోనే ఉంటాను" అన్నాను నేనూ దృఢంగా.

"అలాగే ఉండు. మనూరికొచ్చేదాకా నీకు చిల్లిగవ్వ ఇవ్వను. నీ కాళ్లమీద నువ్వు నిలబడే మాటైతే – నువ్వు పట్నంలో ఉంటే నాకేం? అమెరికా వెడితే నాకేం?" అంది బామ్మ.

పట్నం నాకలోకంలా ఉండాలంటే పల్లెలో బామ్మ ఆస్తి దన్నుగా నాకుండాలి. ఆవిణ్ణి చెండనాడుకుంటే, నాకు మిగిలేది చిప్పే! ఐనా బామ్మే కదా, ఏదో రోజున దిగిరాదా అన్న ఆశతో బింకంగా పట్నాన్నే ఎన్నుకున్నాను.

కానీ పట్టు వదలని విక్రమార్కుడిలా – ఏటా కనీసం  ఒక్కసారైనా మా ఊరెళ్లి బామ్మని కలుసుకుంటాను. ఊళ్లో ఆస్తులు అమ్మేసి, ఆ వచ్చిన డబ్బుని బ్యాంకులో వేసుకుని, ఆ వడ్డీతో పట్నంలో గొప్పగా బ్రతికేద్దామని ఆవిడ కి చెబుతుంటాను.

బామ్మకి చిరాకేసినట్లుంది. ఆరేళ్ల క్రితం కాబోలు, "ఆస్తి శాశ్వతం కానీ, మనుషులు కాదు!" అంది. దానికి నేను, "ఎవరూ శాశ్వతం కాదు కానీ ఎవరో ఒకరు శాశ్వతం అనుకోకపోతే జీవితం రసహీనమౌతుంది. తాతగారికి నువ్వు శాశ్వతం. అందుకే ఆయన ఆస్తి నీ పేరిట వ్రాశారు. నీకు నాన్న శాశ్వతం. నాన్నకి నేను శాశ్వతం. నాకు నా కూతురు సుభద్ర శాశ్వతం. అలా చూస్తే ప్రస్తుతానికి నీకూ సుభద్రే శాశ్వతం. కానీ అది పల్లెటూరికి వెళ్లి ఆస్తిపాస్తులు చూసుకోలేదు. అందుకని ఉన్నదంతా సొమ్ము చేసి, దాని పేరున వేసి, భవిష్యత్తులో దానికి లోటు లేకుండా చెయ్యాలనుకుంటున్నాను. నేనే కాదు, పెద్దవాళ్లెవరైనా నాకు లాగే తమ పిల్ల కోసం ఇలాగే ఆలోచిస్తారు" అంటూ ఆవిడపై కూడా ఓ విసురు విసిరాను.

మనసులో ఏదో మూల చిన్న ఆశ – మునిమనుమరాలు పట్ల తనకి ఎంతోకొంత బలహీనత ఉండక పోదా అని!

"ఉన్నదంతా పిల్లలకి కట్టబెట్టాలనుకోవడం గొప్పనుకోకు. భారతంలో ధృతరాష్ట్రుడూ అలాగే అనుకున్నాడు. ఏం జరిగిందో తెలుసుగా" అంది బామ్మ.

ఆవిణ్ణి నేను భీష్ముడనుకుంటే, తను నన్ను ధృతరాష్ట్రుణ్ణి చేసింది. వెరీ స్మార్ట్!

ఐనా పట్టు వదలని విక్రమార్కుణ్ణిగా, నా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాను. అలా రెండేళ్ల క్రితం – మళ్లీ మేమిద్దరం పల్లె-పట్నం డిబేట్ చేస్తుండగా – "నువ్వెన్ని చెప్పు! పట్నంలో గాలి, నీరు, తిండి – అన్నింటా కుళ్లే. సుభద్రని ఇక్కడే ఉండనీ. ఇక్కడే అది స్వచ్ఛమైన వాతావరణంలో - తన తిండి తను పండించుకుని, నలుగురికి తిండి పెడుతూ ప్రశాంతంగా ఉంటుంది" అంది బామ్మ.

"అంతా నీలాగే అనుకుని పల్లెల్లో మగ్గిపోతుంటే, ప్రపంచం ముందుకెలా వెడుతుంది? ఈ కరెంటు, టివి, మొబైల్సు లాంటి సదుపాయాలన్నీ ఎలా వస్తాయి? ఇంకా అనేక కొత్తవాటిని ఎవరు కనిపెడతారు?" అన్నాను.

"అవి సదుపాయాలే కానీ అవసరాలు కావు. అవి ఆగిపోయినా మనిషి మనుగడకి లోటుండదు. రైతు వల్ల తీరేవే మనకి ముఖ్యావసరాలు. అలాగని – నేను అందర్నీ పట్నం వదిలి పల్లెకి వచ్చెయ్యమనడం లేదు. మనం రైతులం. రైతులుగానే ఉందాం. పల్లెని పల్లెగానే మననిద్దాం. రైతు కానివాళ్లని వాళ్ల ఇష్టానికే వదిలేద్దాం. పల్లె జోలికి రాకుండా పట్నాలు ఎదగాలనుకుందాం" అంది బామ్మ.

“నువ్వన్నది బాగానే ఉంది కానీ - మనం రైతులమని నువ్వనుకుంటే సరిపోతుందా? మేమనుకోవాలిగా – నీకు మా ఇష్టాయిష్టాలతో పని లేదా?” అన్నాను కోపంగా.

“నా గురించెందుకు చెబుతావు? ముందు నీ విషయం చెప్పు. నీకు నీ కూతురి ఇష్టాయిష్టాలతో పనుందా?” అంది బామ్మ.

పట్నంలో పుట్టి పెరిగిన వాళ్లకి పల్లెపై ఉండే ఇష్టాయిష్టాలకు ప్రతినిధి మా అమ్మ. ఆ కాలంలోనే అలాగుంటే – ఈ కాలపు పిల్ల సుభద్ర ఇష్టాయిష్టాలు నేనూహించలేనా?

కానీ బామ్మకు తెలిసినట్లు లేదు. ఒక విధంగా తెలియకపోవడమే మంచిది.

అప్పుడే నాలో చిన్న ఆశ – సుభద్ర కోసమైతే తను పల్లె వదిలి పట్నం వచ్చేస్తుందేమోనని!

“ఎందుకు లేదు? ఇప్పుడే దాన్ని పిలిచి అడిగేద్దాం” అన్నాను.

“ఇప్పుడది మేజరు కాదు. అదేమన్నా చెల్లదు. దానికి పద్దెనిమిది నిండనీ – ఈ విషయంలో ఓ మాటనుకుందాం” అంది బామ్మ.

“అంటే, నా కూతురు నా మాట కాదని నీ మాట వింటుందనా?” అన్నాను.

“ఔను. వింటుంది. ఎందుకంటే పల్లె ద్వేషంలో నువ్వు హరిద్వేషి హిరణ్యకశిపుడికి ఏమాత్రం తీసిపోవు. ఎటొచ్చీ సుభద్రలో ప్రహ్లాదుడి అంశ ఉన్నదని నా నమ్మకం. నా పేరు పెట్టినందుకు, రూపంలోనే కాదు – గుణగణాల్లోనూ నా పోలికే దానిది” అంది బామ్మ.

ధృతరాష్ట్రుడు స్వార్థపరుడైన మనిషి. హిరణ్యకశిపుడు దుర్మార్గుడైన రాక్షసుడు. అంటే బామ్మ నాకు చెడ్డతనంలో ప్రమోషనిచ్చిందని మనసులో నవ్వుకుంటూనే ఇంకేదో స్ఫురించి ఉలిక్కిపడ్డాను.

అప్పుడప్పుడు సెలవులకి పల్లెలో ఉండి వస్తూంటుంది సుభద్ర. అప్పుడు కానీ బామ్మ – ప్రహ్లాదుడికి హరిభక్తి బోధించిన నారదుడిలా, తను సుభద్రకి పల్లెభక్తి ప్రబోధించలేదు కదా అని!

ఐనా సుభద్ర పట్నంలో పెరిగిన పిల్ల. నక్కకూ, నాగలోకానికీ తేడా తెలుసుకోలేదా? బామ్మ విషయంలో - నా వల్లకానిది దానివల్ల ఔతుందనే నా నమ్మకం.

- - - - -

మా ఊరికింక రెండు కిలోమీటర్లుందనగా అడిగింది సుభద్ర, “ఏమిటాలోచిస్తున్నావ్ నాన్నా!” అని.

“ఇందాకా నీ ఫొటోని తెలుపు నలుపుల్లో చూశాను కదా, ఇప్పుడు రంగుల్లో చూడాలనుందమ్మా!” అన్నాను.

నిజానికి నాకు రంగుల ఫోటో చూడాలన్న కోరికేం లేదు. తన జీవితం గురించి నేను కంటున్న కలల గురించి భావగర్భితంగా అన్నాను. కానీ సుభద్రకి ఇంకోలా అర్థమైనట్లుంది.

"దానికేం భాగ్యం? ఇప్పుడే చూపిస్తానుగా" అంటూ సుభద్ర ఓ ఫోటో నాకు అందించింది.

యథాలాపంగా తీసుకుని చూసి, "అరే, ఈ ఫోటో నీది కాదు. ఇది తాతమ్మ ఫోటో" అన్నాను.

"లేదు నాన్నా! అది నా ఫోటోయే. టైం మెషీన్లో ముందు కాలానికెళ్లి తీసుకున్న నా సెల్ఫీ" అంది సుభద్ర.

నేనే ఏదో భావగర్భితంగా మాట్లాడేననుకుంటే, సుభద్ర నాకంటే రెండాకులు ఎక్కువే చదివింది.

"అర్థమయిందిలే! నీది తన పోలిక అని తాతమ్మ పదేపదే అంటుంటే, నిజమనుకున్నావు కదూ...." అని ఇంకా ఏదో అనబోతుంటే-

"అనుకోక? నేను ఎనిమిదీ ప్లస్ పది. తాతమ్మ ఎనిమిదీ ఇంటూ పది. ప్లస్సుని ఇంటూ చేస్తే తాతమ్మ. ఇంటూని ప్లస్ చేస్తే నేను"

"అలాగని నువ్వనుకుంటే ఐపోతుందా?" అన్నాను. పద్దెనిమిదేళ్ల నా కూతుర్ని ఎనభై ఏళ్ల బామ్మగా ఊహించడమే కంపరంగా ఉంది.

"నేననుకోవడం కాదు. నువ్వే అన్నావు. ఇందాకా నీకు చూపించానే తెలుపు నలుపుల ఫోటో. అందులో తాతమ్మ ఎనిమిదీ ప్లస్ పది. అది నిజంగా తాతమ్మ ఫోటోయే. అది చూసి నువ్వు నా ఫోటో అనుకున్నావు" అంది సుభద్ర.

ఉలిక్కిపడ్డాను.

పద్దెనిమిదేళ్ల వయసులో బామ్మ తీయించుకున్న ఫోటో – అచ్చం సుభద్ర ఫోటోలా ఉంది. అంటే 62 ఏళ్ల తర్వాత మళ్లీ తన రూపమే యథాతథంగా భూమ్మీద వెలసింది. భవిష్యత్తులో 62 ఏళ్ల తర్వాత ఆ రూపమెలాగుంటుందో ప్రతిబింబిస్తోంది నా బామ్మ.

ఏం చెప్పదల్చుకుంది సుభద్ర?

అశాశ్వతమైన రూపమే శాశ్వతత్వం కోసం ప్రయత్నిస్తుంటే, శాశ్వతమైన ప్రకృతిని అశాశ్వతం చెయ్యాలనుకోవడం ఎంతవరకూ సబబు – అంటోందా?

'పల్లెల్ని పల్లెలుగానే మననిద్దాం. పల్లెల జోలికి రాకుండా పట్నాలు ఎదగాలని కోరుకుందాం' అన్న బామ్మ మాటల్ని పునరుద్ఘాటిస్తోందా?

మా ఊళ్లో బామ్మ స్థానాన్ని తను తీసుకుంటానని సూచిస్తోందా?

మరి పల్లెలో ఉంటే తనకి పట్నంలో తీరే సరదాలన్నీ తీరతాయా? అక్కడి సదుపాయాలన్నీ అమరుతాయా?

నేను ఆలోచిస్తూనే ఉన్నాను.

'కారే రాజులు......' పద్యం హమ్ చేసుకుంటోంది సుభద్ర.

మరి కొద్ది క్షణాల్లో – కారు పల్లెలో మా ఇంటి ముందాగింది.

అప్పటికే బామ్మ గుమ్మంలో నిలబడి మా కోసం ఎదురు చూస్తోంది.

కారు దిగి ఆవిణ్ణి చూశాను.

అప్పుడావిడ కొత్తగా, ప్లస్సు నుంచి ఇంటూకి మారిన సుభద్రలా, మా సుభద్రకి ఎవరూ అడ్డలేని భవిష్యత్తులా ఉంది.

పక్కకు తిరిగితే సుభద్ర కారు దిగుతోంది. తను కూడా నాకు కొత్తగా ఇంటూ నుంచి ప్లస్సుకి మారిన సుభద్రలా కనబడింది.

ఇటు తిరిగి మా ఇంటిని చూస్తే – అది మమ్మల్ని తన కాలానికి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తోచింది. ఆశ్చర్యంగా నాకూ అదే గమ్యం కావాలనిపిస్తోంది.

"చెప్పానుగా, ఈరోజు ఏదో జరుగుతుందని! జరిగింది మరి" అంది మనసు.

---0---

## రెండవ బహుమతి

# తరుచ్ఛాయ

కలవల గిరిజా రాణి





# తరుచ్ఛాయ

**కలవల గిరిజా రాణి**

ఆదివారం పేపర్ లో వచ్చే పద ప్రహేళిక లో మునిగిపోయి, పూర్తిచేస్తున్న నాకు, ఫోన్ శబ్దం డిస్టర్బ్ చేసింది. కుర్చీలో నుంచి లేద్దామనుకునేసరికి, మోకాలు కలుక్కుమని, 'అబ్బా!' అంటూ మళ్ళీ కుర్చీలో కూలబడ్డాను. వరండాలో కూర్చుని చదువుకుంటున్న రాజీ, గబగబా వచ్చి, కార్డ్ లెస్ ఫోను తీసుకుని నాకు అందించింది. ఎవరి దగ్గరనుండా అని పేరు చూసేసరికి, రూప నుంచి ఫోన్. ఎందుకు చేసిందబ్బా! అనుకుంటూ, కాల్ బటన్ నొక్కేలోగానే కట్ అయిపోయింది.

అసలు ఫోన్ చెయ్యడమే మానేసిన రూప ఇన్నాళ్ళకి ఫోన్ చేసేసరికి ఆశ్చర్యపోయాను. ఇంతలో మళ్ళీ చేసింది. వెంటనే ఆన్ చేసి,

"హలో! రూపా ఎలా వున్నావు తల్లీ!" అని నేనే ముందుగా పలకరించాను.  నా దగ్గర నుంచి ముందుగా పలకరింపు ఊహించలేదేమో.. కాసేపు మౌనంగా వుండి, ఆ తర్వాత,

"బావున్నానమ్మా! నువ్వు ఎలా వున్నావు? నాన్నగారు ఎలా వున్నారు? మీ వంట్లో ఎలా వుంది?" అని అడిగింది.

"బానే వున్నామమ్మా! మీ నాన్నగారు బయటకి వెళ్ళారు. మా ఇద్దరి ఆరోగ్యం బాగానే వుంది. అల్లుడుగారు కులాసాయేనా? ప్రీతి ఎలా వుంది? బాగా చదువుకుంటోందా? బాగా పొడుగయే వుంటుందేమో కదూ?" అంటూ.. కుశలప్రశ్నలు వేసాను.

"ఈయన బాగానే వున్నారమ్మా! ఆఫీసు పని మీద జర్మనీ వెళ్ళారు. రెండు నెలలు అక్కడే వుంటారు. హైదరాబాద్ లో మా ఆడపడుచు కూతురు పెళ్లి ఈ నెలాఖరులో. ఈయనకి రావడం కుదరదుగా! నేనూ, ప్రీతి వస్తున్నాము. ఆ పెళ్లి అయ్యాక, మన ఊరు వద్దామనుకుంటున్నాను" అంది రూప.

ఆ మాటలు వింటూనే ఆశ్చర్యపోయాను. 'ఇక అసలు ఎప్పుడూ ఈ ఊరు రానేరానన్నది. ఇప్పుడు ఎలా వస్తానంటోందబ్బా!' అనుకున్నా.

నా ఆశ్చర్యాన్ని బయటపడనీకుండా, "తప్పకుండా రా తల్లీ.. నీ ఇంటికి నువ్వు వస్తానంటే కాదనేది ఎవరు? దానికి పర్మిషన్ అడగడం ఎందుకు? ఎప్పుడు వచ్చేదీ డేట్ చెపితే .. నాన్నగారు స్టేషన్ కి వస్తారు" అన్నాను.

"ఎప్పుడు వచ్చేదీ ఇంకా అనుకోలేదమ్మా! అక్కడ పెళ్ళి హడావుడి అవగానే వస్తాను. ఫర్వాలేదు, నాన్నగారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు? నాకేం కొత్త కాదు కదా!" అంది రూప.

"అలాగే, చూద్దాం లే, వచ్చే ముందు ఫోన్ చెయ్యి" అన్నాను.

"అలాగే అమ్మా! ఉంటాను మరి" అంది రూప.

నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. 'తమకీ, కూతురికి ఇంచుమించుగా బంధం తెగిపోయిందనే అనుకున్నాను. ఎన్నెన్ని మాటలు అంది. ఇక జన్మలో పుట్టింటి గడప ఎక్కనంది. ఇవన్నీ మర్చిపోయి ఇప్పుడిలా మాట్లాడుతోంటే, నాకు ఎంతో విస్మయంగా వుంది. ఎంతైనా కన్నకూతురు, తను కఠినంగా మాట్లాడిందని... తల్లిని నేనూ అలాగే వుంటే ఎలా? ఏదో అప్పుడు అలా అంది కానీ తర్వాత, బాధపడి వుంటుంది.. పాపం పిచ్చిది. అమ్మని చూడకుండా ఎన్నాళ్లు ఉండగలదు? అందుకే ఇప్పుడు వస్తానని ఫోన్ చేసినట్టుంది. రానన్నావు కదా? ఇప్పుడు ఎందుకు వస్తున్నావు? అనంటూ రావద్దని నేను చెప్పలేను కదా.. అందుకే రమ్మనే ఆహ్వానించాను. ఈయనేమంటారో? తనని అడగకుండానే రూపని రమ్మన్నాను. అసలే రూప మాటలతో చాలా హర్ట్ అయ్యారు. ఇప్పుడు రూప వస్తానంటే., వద్దంటారేమో! ఆ, అయినా ఆయనకి మాత్రం కూతురి మీద ప్రేమ లేకుండా ఎందుకుంటుంది? పైకి అలా మేకపోతు గాంభీర్యంతో వుంటారు కానీ, లోపల కూతురి మీద అభిమానమే వుండి వుంటుంది. కాదని అనరు. పైగా సంతోషిస్తారు' అని నాలో నేనే అనుకోసాగాను.

ఇంతలో మోకాలికి చల్లగా ఏదో స్పర్శ తగిలేసరికి రూప ఆలోచనల నుండి బయటకి వచ్చి, చూసేసరికి, రాజీ .. ఆయింటుమెంటు రాస్తోంది నా మోకాలికి. 'పిచ్చిపిల్ల, ఎంత ప్రేమో నామీద. కడుపున పుట్టిన రూప, దూరమయింది. ఎవరి కడుపున పుట్టిందో! ఈ అనాధకీ, నాకూ ఇలా అనుబంధం ఏర్పడింది' అనుకుంటూ, ప్రేమగా రాజీ తల నిమురుతూ .. "ఇక చాల్లే.. రాజీ.. నొప్పి తగ్గిందిలేమ్మా.." అన్నాను.

"ఉండండమ్మా! ఎంత నొప్పి లేకపోతే, ఇందాకా అంత బాధపడ్డారు. మీరు అబ్బా! అనడం బయటకి వినపడింది నాకు.. ఈ నొప్పిని బాగా నిర్లక్ష్యం చేస్తున్నారు మీరు. డాక్టర్ దగ్గరికి తీసుకు వెళ్ళమని

బాబుగారికి చెపుతాను.  అసలు రెస్ట్ తీసుకోరు, ఏదో ఒక పని చేస్తూనేవుంటారు. చెపితే వినరు.  ఈ రోజు నుంచి వంటపనీ, ఇంటిపనీ అన్నీ నేనే చేస్తాను. మీరసలు కదిలితే ఒప్పుకోను" అంటూ మందలించింది రాజీ.

"ఏంటి రాజీ! మీ అమ్మగారు మళ్లీ మోకాలి నొప్పి అంటున్నారా..  మందు రాస్తున్నావు?" అంటూ వచ్చారు ఈయన.

"చూడండి బాబుగారూ! రోజు ఈ నొప్పి తో బాధ పడుతూనేవున్నారు అమ్మగారు.. రేపు ఎలాగైనా డాక్టర్ కి చూపించాల్సిందే.. లేకపోతే ఒప్పుకోను.." అంటూ ఆర్డర్ వేసింది రాజీ.

"నేను తీసుకువెళ్ళనన్నానా ఏవిటి? మీ అమ్మగారు కదిలితే కదూ! రేపు మనిద్దరం చెరో రెక్కా పట్టుకుని బలవంతంగా తీసుకువెడదాంలే!" అన్నారు.

ఇద్దరి మాటలూ చిరునవ్వుతో వింటున్నాను.

నా చేతిలో ఫోన్ చూసి, "ఫోన్ ఎవరు చేసారు?" అని అడిగారు.

ఆయన ముఖకవళికలు గమనిస్తూ, చిన్నగా, "రూప చేసిందండీ.." అన్నాను. లోపలికి వెళ్ళబోతూ, నా మాటకి వెనక్కి తిరిగి.. “రూప చేసిందా.. ఎందుకూ? ఇన్నాళ్ళకి గుర్తువచ్చామా?  అసలెందుకు మాట్లాడావు? నిన్ను అన్న మాటలు మర్చిపోయావా?" అంటూ ఆవేశపడ్డారు.

"అదేంటండీ, అలా అంటారు. ఎంతైనా మన కన్నకూతురు. అది చేసే తప్పులు, పొరపాట్లు, అన్నీ లెక్క కట్టుకుంటే ఎలా?  చిన్నపిల్ల, అదేదో ఆవేశంతో అంటే, మనమూ ఆవేశపడితే ఎలా? ఇన్నాళ్ళకి తప్పు తెలుసుకుందేమో! అందుకే చేసి వుంటుంది. హైదరాబాద్ వస్తోందట వాళ్ళ ఆడపడుచు కూతురి పెళ్ళికి. అదయ్యాక ఇటు వస్తానంది. సరే అన్నాను" అన్నాను.. ఆయన కోపానికి అడ్డుకట్టవేస్తూ.

"ఇక్కడికా? ఎందుకూ? వద్దని చెప్పు. మనింట్లో ఆవిడ తాహతుకి తగ్గ సౌకర్యాలేమీ లేవు. ఏసీ లు లేవు. సదుపాయాలు లేవు. అవన్నీ ఏర్పాటు చేయడం మన వల్ల కాదు. అవి లేందే ఆవిడా, ఆవిడ కూతురూ వుండలేరుగా! రావద్దని చెప్పు" అన్నారు కోపంగా.

"సర్లెండి, అవన్నీ దానికి తెలీదా ఏమిటి? ఏదో ఇన్నాళ్ళకి మళ్లీ వస్తానని తనంతట తనే అంది.  ఇప్పుడు మీరు ఇలా అడ్డం పెట్టకండి.. నాలుగు రోజులు వుండి వెడుతుంది. రావద్దని ఇప్పుడు చెపితే, పేగు బంధం

శాశ్వతంగానే తెగిపోతుంది. అది మీకు సమ్మతమేనా! అంతకీ మీకు ఇష్టం లేకపోతే, అది వచ్చినపుడు మాట్లాడకుండా వుండండి. అంతేకానీ రావడానికి వీలు లేదని చెప్పకండి" అన్నాను.

"నీ ఇష్టం, తల్లి కూతుళ్లు ఏం ఏడుస్తారో ఏడవండి. నాకు సంబంధించిన వరకూ అది నాకూ ఏనాడో దూరమయింది!" అంటూ విసురుగా లోపలికి వెళ్లి పోయారాయన.

ఆయన వెళ్లిన వైపే చూస్తూ, చెమ్మగిల్లిన కళ్ళని తుడుచుకున్నాను. రూప గురించి ఆలోచనలతో గతం కళ్ళ ముందు తిరగసాగాయి.

* * *

తమ ఒక్కగానొక్క కూతురు రూప. చాలా గారాబంగా, అల్లారుముద్దుగా, నేలమీద నడిస్తే కందిపోతుందని, తమ అరచేతుల మీద నడిపించాము. ఉన్న ఊళ్లో జూనియర్ కాలేజీ లో ఇంటర్ వరకూ చదివి, మంచి మార్కులతో పాసయింది. ఇంజనీరింగ్ ఎంట్రన్సులో తనకి వచ్చిన రాంక్ కి హైదరాబాద్ లో పేరున్న కాలేజీలోనే సీటు వస్తుంది. హాస్టల్లో వుంచి చదివించడానికి సంశయించిన తామిద్దరం, అక్కడ కాకుండా దగ్గర ఊరిలో, ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించి, అదే ఊళ్లో ఉన్న తన అక్కగారింట్లో వుంచి చదివిద్దామని ఈయన అనుకున్నారు. కానీ, రూప ససేమిరా ఒప్పుకోలేదు. మంచి కాలేజీ అయితే కాంపస్ సెలక్షన్లలో వెంటనే మంచి ఉద్యోగం వస్తుంది. తను హైదరాబాద్ లోనే చేరతాను అని పంతం పట్టింది. అలిగి అన్నం తినడం మానేసి, తన మాట నెగ్గించుకుంది.

ఇష్టం లేకపోయినా, తాము రూపని హైదరాబాద్ లో తను కోరుకున్న కాలేజీ లో చేర్పించి హాస్టల్ లో, ఫీజులు కట్టడం పూర్తి చేసి, కావలసిన వస్తువులన్నీ సమకూర్చాము.

హైదరాబాద్ లో వుండే నా మేనత్త కూతురిని పరిచయం చేసాను రూపకి. తను కూడా, ఏదైనా అవసరముంటే నాకు ఫోన్ చెయ్యి, ఆదివారాలు మా ఇంటికి వచ్చేస్తూ వుండు.. అని తన ఫోన్ నెంబర్ ఇచ్చింది. రూప కూడా సరే అంది. రెండు రోజులు వుండి మేము తిరిగి మా ఊరికి వచ్చేసాము. నెలకోసారి ఇద్దరిలో ఎవరో ఒకరం వెళ్లి చూసి వచ్చే వాళ్ళం. మా మేనత్త కూతురింటికి మొదట్లో రెండుమూడు సార్లు వెళ్ళిందట.. తర్వాత తర్వాత తగ్గించేసిందట. ఎప్పుడైనా రమ్మనమని తను ఫోన్ చేసినా, క్లాస్ లు వున్నాయి రావడం కుదరదని చెప్పేదట రూప. స్వతహాగా చదువు మీద ఇంట్రెస్ట్ ఎక్కువే కాబట్టి, ఎప్పుడూ పరీక్షలలో ఫస్ట్ మార్కులే వచ్చేవి. అలాగే నాలుగేళ్ళూ పూర్తయేసరికి, కాంపస్ సెలక్షన్ లో, ఇన్ఫోసిస్ లో ఉద్యోగం సంపాదించుకుంది.

పోస్టింగ్ బెంగళూరులో ఇచ్చారు. ఎలాగూ చదువు కోసం హైదరాబాద్ లో వుంచి, దూరంగా వుండడం మాకు అలవాటై పోయింది. ఇప్పుడు వద్దన్నా ఊరుకోలేదు. మంచి అవకాశం వదులుకుంటే మళ్లీ రాదని, పేచీ పెట్టి, బెంగళూరులో ఉద్యోగంలో చేరిపోయింది.

"నువ్వు అనుకున్నట్టుగా మంచి ఉద్యోగం సంపాదించుకున్నావు. నీకూ పెళ్ళి వయసు వచ్చింది. ఇక సంబంధాలు చూడడం మొదలెడతాము" అని అనగానే, “అప్పుడే ఏంటమ్మా. ఇప్పుడే జాబ్ వచ్చింది, కనీసం ఓ రెండేళ్ళయినా నేను ఫ్రీ గా లేకుండా, పెళ్లి కి తొందరేంటీ?" అంటూ మా ప్రయత్నాన్ని వాయిదా వేయించింది. సరే, అనక తప్పలేదు మాకు. ఈ లోగా, కంపెనీ పని మీద ఆఫీసు వాళ్ళు రూపని ఆరు నెలలు అమెరికా పంపదలచుకున్నారు. ఆ మాట చెప్పగానే, మేమిద్దరం ససేమిరా వద్దన్నాము. మొండిగా వాదన చేసింది. "అసలు అమెరికా వెళ్లడానికి అందరూ కలలు కంటూ వుంటారు. ఎంతో ఖర్చుతో కూడిన పని. అలాంటిది ఆఫీసు వాళ్ళే స్వంతఖర్చుతో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి పంపుతూంటే, ఇప్పుడు నేనుకాదంటే, ఈ అవకాశాన్ని తన్నుకుపోవడానికి నా వెనక చాలామందే రెడీగా వున్నారు. నా ప్రతిభని గుర్తించి నాకు వచ్చిన ఛాన్స్ ఇది. వదులుకుంటే అవివేకమే. నేను తప్పక వెళ్లి తీరతాను" అని మరో మాట అనడానికి వీలు లేకుండా చెప్పేసింది.

మళ్లీ సరే అనక తప్పలేదు. పంపలేక పంపలేక ఎన్నో జాగ్రత్తలు చెప్పి, అమెరికా విమానం ఎక్కించాము. చాలా సంతోషంగా వెళ్ళింది, మరో ఆరు నెలలు పొడిగించారని చెప్పింది. ఏడాది తర్వాత, అమెరికా నుంచి తిరిగి వచ్చింది. ఒక్కర్తీ కాదు, జంటగా వచ్చింది. తనతో పాటు అదే ఆఫీసులో పనిచేసే సూర్యని, అమెరికా లోనే పెళ్ళి చేసుకుని, మా ఆశీర్వాదం కోసం వచ్చామని చెప్పింది.

ఏమనాలో కూడా అర్థం కాని పరిస్థితిలో మేమిద్దరం నిశ్చేష్టులమయిపోయాము. మా గారాలపట్టి మీద ఎన్నెన్ని కలలు కన్నాము. మా ఆశల మీద నీళ్లు చల్లేసింది. మా పెంపకం చివరికి ఇలా దారితీసిందనుకుని, ఎంతగానో బాధపడ్డాము. రూప మీద అతి ప్రేమతో, ఏదడిగినా కాదనకుండా, ఎక్కడ బాధపడుతుందో, కాదంటే ఎక్కడ నొచ్చుకుంటుందో అని, తన కోరికలన్నీ తీర్చినందుకు ఇప్పుడు ఇలా శిక్ష వేసింది మాకు. ఒక్క మాట మాకు చెప్పినా కాదనము. తన భవిష్యత్తు బావుండాలన్నదే మా తపన కూడా.

"తల్లితండ్రులుగా మాకిచ్చే మర్యాద గౌరవం ఇదేనా? పెళ్ళి చేసుకునేముందు ఒక్కసారి కూడా అమ్మా నాన్నలకి చెపుదామన్న ఆలోచన రాలేదా?" అని నేను విరుచుకుపడ్డాను.

"అది కాదమ్మా! సూర్య.. మన వాళ్లు కాదు. ముందు చెపితే మీరు కాదంటారని, ఒప్పుకోరనీ, పెళ్లి అయిపోయాక అయితే మీరు కాదనేది వుండదని, ఆ తర్వాత మీరు ఒప్పుకుంటారు కదా అని మీకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్నాను. మన్నించండి" అని ఎంతో తేలిగ్గా తన తప్పును తేల్చిపారేసింది.

ఈయన, "ఊరుకోవే.! అదిప్పుడు చిన్న పిల్లకాదే. ఇప్పుడేంటి? ఎప్పుడో, అది దాని జీవితాన్ని అదే నిర్ణయించుకుంది. దాని చదువు, ఉద్యోగం, అమెరికా. ఎలా అనుకుందో.. ఇప్పుడు పెళ్లి కూడా అదే నిర్ణయించుకుంది. మన అవసరం కానీ.. మన అంగీకారం కానీ దానికి అవసరం లేదు. నువ్వు బాధ పడకు. దాని జీవితం దానిష్టం" అని అన్నారు.

"మంచిది రూపా! కనీసం ఇప్పుడైనా నువ్వే చెప్పావు. ఇదే సంగతి పరాయి వారి ద్వారా వినకుండా నీ ద్వారా వినడం వల్ల మాకు కాస్త గౌరవం మిగిలుందనే అనుకుంటున్నాను. సంతోషం. మీరిద్దరూ హాయిగా వుండండి."

"వాళ్ళిద్దరినీ లోపలకి తీసుకువెళ్ళు!" అని ఈయన చెప్పేసరికి లోపలకి రమ్మని పిలిచాను. సూర్య మొహమాటమో.. మరేంటో కానీ.. ఉన్న రెండు రోజులూ సరిగ్గా మాట్లాడనే లేదు. రూప కూడా.. తను చేసిన పనికి గిల్టీగా వుందో ఏమిటో.. కలివిడిగా వుండలేకపోయింది. రెండో రోజు మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయిపోయారు. అమెరికాలో స్వంత ఇల్లు కొనుక్కున్నారట.. అక్కడకే తిరిగి వెళ్ళిపోయారు. ఎప్పుడైనా ఫోన్ చేసేది. ఏడాది తర్వాత. ఆడపిల్ల పుట్టిందని ఫోన్ చేసి చెప్పింది. నెలతప్పినట్లు కూడా చెప్పనేలేదు. అంత కానివారిమయిపోయామా అని బాధ పడ్డాను. కూతురి ఫోటోలు పంపేది ఎప్పుడైనా.. చక్కని చుక్కలా వుంది. మనవరాలి అచ్చట్లు ముచ్చట్లు చూడలేకపోయినందుకు బాధపడేదాన్ని.

* *. *

ఆ తర్వాత.. రూప, సూర్య ఇండియాకి వచ్చేసారు. ఇద్దరికీ ఢిల్లీలో ఉద్యోగాలు... బిజీ లైఫ్... ఎప్పుడైనా ఇక్కడకి వచ్చినా..రెండుమూడు రోజుల కంటే ఎక్కువ వుండేది కాదు. మనవరాలు ప్రీతి కూడా చేరిక అవలేదు.. దాని ప్రపంచం దానిదే... ఆ ఫోనులోనే ఎప్పుడూ మునిగిపోయుండేది. ప్రీతికి పదహారో పుట్టినరోజు గ్రాండ్ గా చేస్తున్నామని... మా ఇద్దరినీ రమ్మని ఫోన్ చేసింది రూప. ఈయనకి రావడం ఇష్టం లేక.. నా ముచ్చట కాదనలేక నన్ను ఒక్కదాన్నీ ఢిల్లీకి పంపారు.

చాలా అట్టహాసంగా చేసారు పార్టీ.. ఎందుకో ఆ వాతావరణంలో ఇమడలేకపోయాను. ప్రీతికి.. ఫ్రెండ్స్ అమ్మాయిలూ, అబ్బాయిలూ.. చాలామంది వచ్చారు. రూప, సూర్య స్నేహితులు కూడా... అందరూ హైక్లాస్ మనుషులే .. వారందరితో కలిసిపోయి ప్రవర్తించే రూప.. నా కూతురేనా.. అని అనిపించింది.

ఆ తర్వాత నాలుగు రోజులు వున్న నాకు ప్రీతి తీరు నచ్చలేదు. ఇంటికి వచ్చిన స్నేహితులతో.. ప్రవర్తించే విధానం.. తలుపులు వేసుకుని.. గంటలకొద్దీ కబుర్లు .. నేను బొత్తిగా జీర్ణం చేసుకోలేకపోయాను.

రూప వచ్చాక.. ప్రీతిని పెంచే పద్ధతిపై నిలదీసాను. 'ఉద్యోగం అంటూ నువ్వు ఇంటిపట్టున వుండవు.. పిల్ల గురించి నిర్లక్ష్యం చేస్తున్నావు.. ఇది మంచి పద్ధతి కాదు..' అని హితబోధ చేసేసరికి.. ఇంతెత్తున లేచింది నా మీద..

"నా కూతురిని ఎలా పెంచుకోవాలో నాకు తెలుసు.. నీ నీతిబోధలు నాకు అనవసరం. ఈ రోజుల్లో పిల్లలు ఇలాగే వుంటున్నారు. మంచి చెడూ వారికి తెలుసు. ఎవరూ చెప్పక్కర్లేదు. నువ్వు చెప్పే... పల్లెటూరి బోధలు తప్పించుకునే నేను హాయిగా వుంటున్నాను. నా కూతురి మీద నీ ఆంక్షలు ఏంటి? నా కూతురిని నాగరీకంగా పెంచదలుచుకున్నాను.. ఎంత డబ్బైనా ఫర్వాలేదు.. అన్ని సౌకర్యాలు, సౌఖ్యాలు సమకూరుస్తాను. నాకా స్థోమత వుంది. మీ పల్లెటూరి ఆలోచనలు, చింతకాయపచ్చడి భావనలూ నా కూతురి మీద చూపించవద్దు, అవి నాకు నచ్చకే ముందు నుంచీ దూరంగా వున్నాను. అటువంటి వాటికి దూరంగా ప్రీతిని ఉంచడానికే .. నేను మన ఊరు రావడం మానుకున్నాను. ఇలాంటి నీతిబోధలు చేస్తే.. నేనూ, ప్రీతీ.. ఇంకెప్పుడూ కూడా మీ గడప తొక్కము!" అని నిక్కచ్చిగా చెప్పేసరికి నివ్వెరపోయాను. కన్నతల్లి తో మాట్లాడే పద్ధతి ఇదేనా అనిపించింది. నాకు తలకొట్టేసినట్లయింది. నా పెంపకం మీద నాకే వెగటు పుట్టింది. అవమానభారంతో తిరుగుప్రయాణమై ఇంటికి రాగానే.. ఈయనకి చెప్పి కన్నీళ్ల పర్యంతమయ్యాను.

"పిచ్చిదానా! ఎందుకు ఏడుస్తావు? అది మనల్ని కాదనుకుని ఎప్పుడు పెళ్ళి చేసుకుందో.. అప్పుడే నేనో నిర్ణయం తీసేసుకున్నాను. మనకి కూతురనేది లేదని... అది మనింటికి రాననడం కాదు.. నేనే దానిని మన ఇంటికి రానీయను అని. కానీ నీకోసం.. నా పంతం సడలించుకున్నాను. ఇక ఇప్పుడు నీకూ అర్థమయింది కదా... ఇకనైనా తెలుసుకో.. దాని జీవితంలో మన ప్రమేయం దానికి అవసరంలేదని స్పష్టంగా చెప్పినప్పుడు... మనం మాత్రం ఎందుకు కలగచేసుకోవాలి! ఊరుకో.. బాధపడకు! దాని సంపాదన.. దాని స్టేటస్.. దాని గొప్ప.. దానికే వుండనీ.. ఎగిరెగిపడుతోంది.. ఏదో ఒకనాడు కనువిప్పు కలుగుతుంది దానికి" అని ఓదార్చారు.

ఇదిగో.. ఇన్నాళ్ళకి రూప దగ్గర నుంచి ఫోన్.. అది అన్న మాటలకి నా మనసు కష్టపడ్డమాట నిజమే. కానీ, కన్నకూతురిని ఇంటికి రావద్దనేంత కఠినాత్మురాలిని కాదు కదా! పంతాలూ, పట్టింపులూ ఇవన్నీ దూరమే నాకు.. అనుకుని సమాధానపడ్డాను.

ఆ తర్వాత వారమే ఫోన్ చేసింది. ఆదివారం నాడు తనూ, ప్రీతి వస్తున్నామని చెప్పింది.

స్టేషన్ కి ససేమిరా వెళ్ళనని అన్నారు ఈయన. చేసేదేంలేక, పనివాడు రామన్నని, అద్దె కారు మాట్లాడి పంపించాను. ఆ కారులో రూప, ప్రీతి ఇంటికి వచ్చారు.

కారు శబ్దానికి బయటకి వచ్చాను. రూపకీ, ప్రీతికీ దిష్టి తీసి లోపలకి తీసుకువెళ్ళాను. రూపని చూడగానే, నాలో తల్లి ప్రేమ బయటకి వచ్చింది. ఆప్యాయంగా రూపని కావలించుకునేసరికి, రూప నా చూట్టూ వేసిన చేతుల స్పర్శతో తెలిసిపోయింది .. రూపలో మార్పు!

రాజీకి ముందుగానే చెప్పేసరికి, అది పరిచయమున్న వారిలాగే, రూపనీ, ప్రీతినీ ప్రేమగా ఆహ్వానించింది. ముందు రోజే గది శుభ్రం చేసి పెట్టింది. వాళ్ళ సామాన్లు అన్నీ ఆ గదిలో పెట్టి, కాఫీలు కలిపి తీసుకువచ్చి రూపకీ, ప్రీతికీ అందించింది. ప్రీతితో మాటలు కలిపేసింది అప్పుడే. కానీ ప్రీతి చాలా ముభావంగా వుండడం గమనించాను.

రాత్రి భోజనాల దగ్గర రూప వాళ్ళ నాన్నతో మాటలు కలపాలని చూసింది, కానీ ఆయన మాత్రం ముక్తసరిగా ఆ.. ఊ.. అని సమాధానం చెప్పేసరికి, తన మీద తండ్రికి కోపం పోలేదనుకుని మౌనంగా వుండి పోయింది. భోజనాలు అయ్యాక నేను, రూప హాల్లో కూర్చున్నాము. ప్రీతికి నిద్ర వస్తోందని గదిలోకి వెళ్ళి పోయింది. రాజీ వంటిల్లు సర్దుతోంది.

"అమ్మా! ఈ రాజీ ఎవరు?" అని అడిగింది రూప.

“రూపా! నువ్వు లేని వెలితిని నింపడానికి నాకు దేముడిచ్చిన కూతురు రాజీ. నువ్వు ఏనాడు నన్ను కాదన్నావో, ఏనాడు దూరం అయ్యావో, సరిగ్గా అప్పుడే నాకు ఈ రాజీ దగ్గరయింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులని కోల్పోయిన అనాధ. ఒకసారి నాకు గుడి దగ్గర కనపడింది. అక్కడున్న వారిని వాకబు చేస్తే, ఎవరూ లేని అనాధ అని చెప్పారు. నాతో పాటు ఇంటికి తీసుకువచ్చాను. స్కూల్లో చేర్పించారు నాన్నగారు. ఇంటర్ పూర్తయింది. కాలేజీకి పంపి డిగ్రీ లో చేర్పిస్తానంటే, మమ్మల్ని వదిలి వెళ్ళడం ఇష్టం లేక, తను వెడితే నన్ను చూసుకుందుకి ఎవరూ వుండరని, ప్రైవేటుగా డిగ్రీకి కట్టి ఇంటిపట్టునే వుండి చదువుకుంటానంది.

నాకు ఇంటిపనీ, వంట పనిలో సహాయం చేస్తూ, మిగిలిన టైమ్ లో చదువుకుంటూ వుంటుంది. మనింట్లో బాగా కలసిపోయింది" అని రాజీ గురించి చెప్పాను.

అంతా వింటున్న రూప మొహం లో ఏదో గిల్టీనెస్ కొట్టొచ్చినట్టు కనపడింది.

"అమ్మగారూ... రూపమ్మ వచ్చిన ఆనందంలో మీరు టాబ్లెట్ వేసుకోవడం మర్చిపోయారు!" అంటూ రాజీ మాత్ర, మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది.

"మోకాలికి ఆయింటుమెంటు రాయమంటారా?" అని అడిగింది

"వద్దు.. ఇక పడుకో.. ఇప్పటికే లేటు అయింది!" అనేసరికి సరే అంటూ తన గదిలోకి వెళ్లి పోయింది రాజీ. అటువైపే చూస్తూ వుండిపోయింది రూప.

"ఏంటి.. రూపా.. ఆలోచిస్తున్నావు?" అన్నాను.

"అబ్బే.. ఏం లేదమ్మా.. పద పడుకుందాం" అంటూ లేచింది రూప.

మర్నాడు... ఉదయమే లేచిన ప్రీతి.. వాకిట్లో రాజీ పెడుతున్న ముగ్గుని తదేకంగా చూస్తోంది. రాజీ ఏ పని చేసినా.. పరిక్షగా గమనిస్తోంది. రాజీ కూడా ప్రీతితో ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంది. ఇంచుమించుగా ఇద్దరి వయసూ సమానంగా వుండడంతో.. ఇద్దరూ స్నేహితులై పోయినట్టుంది. వచ్చిన వెంటనే సరిగ్గా పలకరించలేదు కానీ క్రమేపీ మాతో ప్రీతి మాటలు కలుపుతోంది.

రూప వచ్చి రెండు రోజులయింది... ఇక ఎప్పుడో అప్పుడు బయలుదేరతానంటుంది అని అనుకుంటున్నాను. మా ఇద్దరి మధ్య.. పాత సంగతులేవీ రాలేదు.. ఎవరూ ఎత్తలేదు.

ఉదయం నుంచి.. రూప ఏదో అస్థిమితంగా వుండడం గమనించాను. ఏదో పని వున్నట్లు.. వంటింటిలో వున్న నా దగ్గరకి పదే పదే రావడం.. మళ్లీ వెనక్కి వెళ్ళడం..

"ఏమ్మా! కాఫీ తాగుతావా?" అన్నాను.

"అహ.. వద్దమ్మా.. ఏదైనా సాయం చేద్దామని వచ్చాను" అంది.

"ఎందుకమ్మా.. ఇదెంత పనీ... నువ్వు అలా కూర్చుని కబుర్లు చెప్పు చాలు" అన్నాను.

ఏదో చెప్పాలనుకుంటోంది.. కానీ చెప్పలేకపోతోందని అర్ధమయింది నాకు.

సాయంత్రం.. "రూపా! అలా గుడికి వెళ్లి వద్దాం.. రెడీ అవమ్మా.. రాజీ, ప్రీతీ కబుర్లు చెప్పుకుంటూ వుంటారులే.. మనం వెళ్ళొద్దాం!" అని బయలుదేరతీసాను. ఇప్పుడైనా తన మనసులో వున్నది బయటపెడుతుందని.

గుళ్ళో దైవదర్శనం అయ్యాక, అక్కడ మెట్ల మీద కూర్చున్నాం. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది రూప.

ఇక లాభం లేదని నేనే కదిలించాను.

"రూపా! ఏంటమ్మా... నువ్వు వచ్చినప్పటినుంచీ చూస్తున్నా... ఏదో మధనపడుతున్నావు.. నాతో చెప్పడానికి మొహమాటం ఎందుకమ్మా" అన్నాను.

ఈ మాటలతో... ఒక్కసారిగా గట్టు తెగిన గోదావరిలా... రూప నా వళ్ళో తలపెట్టేసుకుని...

"నన్ను క్షమించమ్మా... ఏ కూతురూ కూడా తల్లితో ప్రవర్తించకూడని రీతిలో నీతో ప్రవర్తించాను. నానా మాటలు అన్నాను. బయటకి చదువుకోడానికి పంపడం ఇష్టపడలేదని.. మీమీద వ్యతిరేకత పెంచుకున్నాను. పెళ్లి విషయంలో కూడా మిమ్మల్ని నిర్లక్ష్యం చేసాను. నీకూ, నాన్నగారికీ ఇవ్వాల్సిన గౌరవం, మర్యాద ఇవ్వలేదు. అయినా మీరిద్దరూ నన్ను ఏమీ అనలేదు. నా కూతురు విషయంలో నువ్వు హితబోధ చేస్తే పెడచెవిన పెట్టి, నిన్ను తూలనాడాను. కళ్లు నెత్తికెక్కి విర్రవీగాను. ప్రీతిని పెంచవలసిన పద్ధతి నాకే తెలుసనుకున్నాను. కానీ.. చేతులు కాలిపోయాక గానీ, నువ్వు చెప్పింది నా మంచికే అని తెలుసుకోలేకపోయాను. నేను చేసిన గారం, అడిగినప్పుడల్లా విచ్చలవిడిగా డబ్బు ఇవ్వడంతో.. ప్రీతి చెడు స్నేహాల బాట పట్టింది. డ్రగ్స్ కి అలవాటు పడింది. బాయ్ ఫ్రెండ్స్ తో తిరుగుళ్లు చాలా దూరం వెళ్లి పోయింది. ఇదంతా నాకు పూర్తిగా తెలిసేసరికే నా చేతులు దాటి పోయే ప్రమాదం వచ్చేసింది. వెంటనే నా ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టేసి, ప్రీతిని డ్రగ్ అడిక్షన్ సెంటర్ లో ట్రీట్మెంట్ ఇప్పించాను. ఆ తర్వాత కొంతవరకూ ఫర్వాలేదు. కోలుకుంది. కానీ ఎప్పుడూ ఏదో ఆలోచనలతో, నిరాశా నిస్పృహలలో మునిగిపోయి వుండేది. అక్కడ డాక్టర్లు కొంతకాలం అక్కడ వాతావరణానికీ, ఆ స్నేహితులకీ దూరంగా వుంచమన్నారు. ఎక్కడుంచితే ప్రీతి తిరిగి కోలుకుని మామూలు మనిషి అవుతుందా అని ఆలోచిస్తే.. అది నీ పెంపకంలోనే అని అనిపించింది. నీ పెంపకంలో పెరిగితే ఎంతో ఉన్నతంగా పెరుగుతారు. కానీ నేనే సరిగ్గా పెరగలేదు. నీ పెంపకాన్నే కాదనుకుని... నా కూతురిని కూడా సరిగ్గా పెంచలేకపోయాను. ఎవరో కన్నబిడ్డ రాజీ.. తననే గొప్ప వ్యక్తిత్వంగల మనిషిలా

తీర్చిదిద్దుతున్నావు నీవు... అలాంటిది ప్రీతి విషయంలో కాదనకమ్మా! నా తప్పులు మన్నించు... నేను చేసిన తప్పుకి శిక్షగా నా కూతురుని నీ దగ్గర ఉంచుకోనని మాత్రం అనకమ్మా! నీ పెంపకంలో.. ప్రీతి ఉన్నత వ్యక్తిత్వం, మంచి నడవడికతో తయారవుతుందన్న నమ్మకం కలుగుతోంది.. రాజీ స్నేహం కూడా ప్రీతిలో మార్పు తేగలదు. దయచేసి నాన్న గారిని ఒప్పించమ్మా! నా బిడ్డని మీ చేతులలో పెడుతున్నాను.. కాదనకమ్మా!" అంటూ ఏడుస్తూ నా కాళ్ళని చుట్టేసింది రూప.

లాలనగా దగ్గరకి తీసుకున్నాను రూపని.

"పిచ్చిదానా... నీ మీద నాకు కోపం ఏమిటమ్మా... అదప్పుడే మర్చిపోయాను! ఇప్పటికైనా ప్రీతి విషయంలో కళ్ళు తెరిచావు అదే చాలు. నా దగ్గర నీ బిడ్డ.. నా పెంపకంలో లక్షణంగా వుంటుందని నీవనుకుంటే.. అలాగే.. నేను కాదనను. నా పెంపకం ఎప్పుడూ ఒకలాగే వుంటుంది. అది నీ విషయమైనా సరే.. ప్రీతి విషయమైనా, రాజీ విషయం అయినా సరే. కానీ నువ్వు, ఆ పెంపకాన్నే ప్రశ్నించి దూరమయ్యావు. ఇప్పుడు తెలుసుకుని నీ కూతురిని నా చేతుల్లో పెడుతున్నావు. నాన్నగారు కాదని ఎందుకనుకుంటున్నావు? ఆయన మనసులో నీదెప్పుడూ స్థిర స్థానమే. సందేహించకు. ప్రీతి విషయంలో ఎటువంటి బెంగా పెట్టుకోకు.. ఉన్నతంగా పెంచుతాను. మంచి లక్షణాలతో విలసిల్లేలా చేస్తాను" అంటూ రూప చేతిలో ఒట్టేసి మరీ చెప్పాను.

నా పెంపకం మీద సందేహం కలిగింది ఆనాడు.. కానీ ఇప్పుడు ఆ సందేహం పటాపంచలయిపోయింది. ఇప్పుడు నా రెండు కళ్లు..రాజీ, ప్రీతి. మంచి నడవడిక, మంచి మార్గంలో వీరిద్దరూ నడవడానికి మార్గం నేనే వెయ్యాలి. నా పెంపకంలో వీరిద్దరూ ఎంతో ఉన్నతమైన కాంతిమయ జీవితం గడప గలగాలి... అని ఆలోచిస్తూ, రూప చేయందుకుని ఇంటి దారిపట్టాను.

* * *

మూడవ బహుమతి

# రాగ ధ్వని

పక్కి శివ ప్రసాద్



# రాగ ధ్వని



పక్కి శివ ప్రసాద్

వరండా లోంచి దగ్గు ఆగకుండా ఖళ్ళు ఖళ్ళు మని వినిపించడంతో నిద్రా భంగం అయిన రాజు చిరాకుగా అటూ ఇటూ పక్క మీద కదిలాడు.

"ఈ ముసల్ది సుఖంగా నిద్ర పోనివ్వదు" గొణిగాడు.
పగలంతా కష్టపడి వచ్చిన భర్తకు ప్రతీ రాత్రి ఇలా అత్త గారి దగ్గు ఇబ్బంది పెట్టడాన్ని విసుక్కుంటూ, లేచి వంటింట్లోకి వెళ్లి, కరక్కాయ ముక్క తీసి, "ఇది బుగ్గన పెట్టుకో...ఆ ముదనష్టపు దగ్గు ఆపుకో...మమ్మల్ని కాసేపైనా నిద్రపోనీయ్" గట్టిగా అరుస్తూ చెప్పింది రాణి.

వరండాలో  నులక మంచం మీద ఒళ్ళంతా దుప్పటి చుట్టుకుని కూర్చున్న ఆ ముసలి తల్లి కరక్కాయ ముక్క నోట్లో పెట్టుకుని, వస్తున్న దగ్గుని ఆపడానికి విశ్వప్రయత్నం చేస్తూ "ప్రాణాలు పోయినా బాగుణ్ణు" అని గొణిగింది.
వరండా కటకటాలకు  గాలి రాకుండా వేలాడదీసిన తాటాకు చాప అంతంత మాత్రంగానే ఉంది. చల్లటి చలిగాలి రివ్వున వీస్తూ గజగజ లాడించేస్తోంది.  ఆగినట్టు ఆగి మళ్ళా దగ్గు ఒక్కసారి విజృంభించింది.  తెల్లవార్లూ పాపం ఆ ముసలి తల్లి దగ్గుతూనే ఉంది.

*                *                *

ఉదయం రాజు లేచేసరికి ఏడు గంటలు దాటిపోయింది. నిద్ర చాలక కళ్ళు మండిపోతున్నాయి. ఆదరా బాదరాగా తయారయి, టిఫిన్ చేసి బైటకొచ్చేసరికి, తల్లి ఇంకా నిద్ర లేవలేదు. రాత్రంతా దగ్గుతో అలసిపోయి తెల్లారి జాము వేళ నిద్ర పట్టినట్లుంది.  తన ఆటో శుభ్రం చేసుకుని రెడీ అయ్యేసరికి, నాలుగేళ్ళ కొడుకు స్కూల్ బాగ్ తో "నేను రెడీ" అంటూ వచ్చేశాడు.
రోజు కొడుకుని కాన్వెంట్ లో దించి డ్యూటీ ఆరంభిస్తాడు. ఒకోసారి ఆటో రాత్రి పది దాటే వరకు తిప్పుతాడు. ఆదాయం బావుంటుంది కనుక కొడుకుని కాన్వెంట్ లో చదివిస్తున్నాడు.  రాత్రి సరిగ్గా నిద్ర లేకపోవడంతో, మధ్యాహ్నం ఒంటి గంటకు మంచి ఎండలో భోజనానికి వచ్చినవాడు, తిండి తిన్న తరువాత మత్తుగా సాయంకాలం నాలుగు వరకు నిద్ర పోయాడు.

"బాబీ స్కూల్ విడిచి పెట్టే టైం అయ్యింది, లే" అంటూ రాజుని నిద్ర లేపింది రాణి.
వేడి టీ తాగాక గాని తేరుకోలేకపోయాడు. కొడుకుని కాన్వెంట్ నుండి ఇంట్లో దింపి ఆటోలో వెళ్ళిపోయాడు. ఆ

వెళ్లడం మంచి బేరాలు తగిలి తిరిగి ఇంటికి వచ్చేసరికి రాత్రి పది గంటలు దాటింది. వరండాలో తల్లి నిద్రపోతోంది. బాబీని నిద్రపుచ్చుతోంది రాణి. తండ్రిని చూడగానే లేచి కూర్చున్నాడు. జిలేబి పొట్లం అందించాడు. రోజు అలా తేవడం అతనికి అలవాటే. నానమ్మకో జిలేబి ఇవ్వడానికి బాబీ వరండాలోకి వెళ్లబోయాడు. “నానమ్మ నిద్ర పోతోంది, రేపు ఇద్దువులే” అంది రాణి. బాబీ ఆగిపోయాడు. రాజు వేడి నీళ్లతో స్నానం చేసి భోజనానికి కూర్చున్నాడు. ఈ లోగా కొడుకుని నెమ్మదిగా నిద్రబుచ్చింది రాణి. రాజు మంచం మీదకు వచ్చి సిగరెట్ వెలిగించాడు.

రాణి అతని ఫాంట్ జేబులోని డబ్బులు తీసి లెక్కపెట్టి పెట్టెలో పెడుతూ " పడుకోరాదూ...ఇప్పుడేందుకా పాడు సిగరెట్” విసుక్కుంది రాణి. రెండు నిమిషాలు గడిచాక ఆఖరి దమ్ము పీల్చి, సిగరెట్ ముక్క నలిపి విసిరేసి, లైట్ ఆపాడు. తరువాత నెమ్మదిగా భార్య మీద చేయి వేసాడు. చీకటిలో ఉరకలెత్తిన ఆవేశం ఆకాశపు అంచులు చూసింది. అలసిన శరీరాలు గాఢ నిద్రలోకి జారుకున్నాయి.

ఓ అరగంట తరువాత ఖళ్ళుఖళ్ళు మని వరండాలోంచి ఆగకుండా వచ్చిన దగ్గు శబ్దానికి ఇద్దరికీ నిద్రా భంగం అయ్యింది. రాజు కి వెర్రి కోపం వచ్చింది.

"చంపుతోంది...లం..." భరించలేని కోపంతో అరిచాడు.
"అది చావదు, మనల్ని చంపుతాది” అంటూ రాణి విసురుగా లేచి వరండాలోకెళ్లింది.
భార్య తిట్లు వినిపిస్తున్నాయి రాజుకి. తెల్లవార్లూ ఆ దగ్గుకి నిద్ర పట్టలేదు. మరుసటి రోజు వీధి చివర డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లాడు. మందులు వాడినా తల్లి దగ్గు తగ్గలేదు. పగలంతా కష్టపడి ఆటో తిప్పిన రాజుకి రాత్రుళ్ళు సరిగా నిద్ర లేక పోవడం చికాకు గానే ఉంటోంది. రోజుల తరబడి ఈ నిద్రలేమి కారణంగా ఒకరోజు ఆటో పెద్ద ఆక్సిడెంట్ కి గురి కావాల్సివచ్చింది. ఎదురుగా ఇంచుమించు మీదకు దూసుకొచ్చిన లారీని వెంట్రుక వాసిలో తప్పించుకున్నాడు. అదృష్టం బావుండటంతో చేతికి చిన్న గాయం, ఆటోకి చిన్న డేమేజితో ఆగింది. కానీ, ఆ సంఘుట తో రాణి చాలా తల్లడిల్లి పోయింది. ఒకవేళ ఇంకేదైనా పెద్ద ప్రమాదం జరిగితేనో? అన్న భయం ఆమెను వణికించింది. భర్తతో అదే మాట చెప్పి కళ్లనీళ్లు పెట్టుకుంది.

***

ఊరు చివర ఒక బేరానికి వెళ్లిన రాజుకి అక్కడ ఒక వృద్ధాశ్రమం కనిపించింది. అది చూడగానే అతనికి కొత్త ఆలోచన కలిగింది.అంతే! ఇంక రెండో ఆలోచనకు తావులేకుండా, ఆరోజే తల్లిని తన ఆటోలో ఎక్కించుకుని ఆ ఆశ్రమానికి తీసుకెళ్లి వాళ్లకు అప్పగించాడు.

"రోజు ఏదో టైం లో వచ్చి కనిపిస్తాను. నీకిక్కడే బావుంటుంది!" చెప్పాడు. తల్లి ఏం మాట్లాడలేదు. ఆమె మొహం వాడిపోయి ఉంది. కళ్ళలో నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. ఆశ్రమ నిర్వాహకులు ఆమె

వివరాలు నమోదు చేసుకున్నారు. ఆధార్ జిరాక్స్ అడిగి తీసుకున్నారు. ఆరోగ్య వివరాలు అడిగితే దగ్గు సంగతి చెప్పాడు. ఇంటికి వచ్చేశాడు.

"ఇరుగూ, పొరుగూ నన్ను ఆడి పోసుకుంటున్నారు!" చెప్పింది రాణి.
రాజు ఏం మాట్లాడకుండా భోజనం చేసి మంచం మీదకు చేరాడు.
"నానమ్మ ఏది?"అడిగాడు బుజ్జి.
రాజుకి ఏం చెప్పాలో తెలియలేదు.
"ఊరెళ్ళింది కానీ, నువ్వు పడుకో" కసిరినట్టుగా చెప్పింది రాణి.
బుజ్జి బిక్క మొహం వేసుకుని పడుకున్నాడు. రాణి లైట్ ఆపేసింది. రాజుకి మనసంతా భారంగా తోచింది. బలంగా నిట్టూర్పు విడిచాడు. రాణి అనునయంగా అతని మీద చేయి వేసింది. ఓ గంట తరువాత నిద్రలోకి జారుకున్నాడు. మంచి నిద్రలో ఉన్న రాజుకి ఖళ్ళుఖళ్ళుమని దగ్గు శబ్దం వరండా లోంచి ఉధృతంగా వినిపించడంతో తుళ్ళిపడి లేచి ఆతృతగా వరండా లోకి వెళ్ళాడు. అక్కడ ఎవరూ లేరు.
ఖాళీ మంచం జాలిగా చూస్తోంది.

***

ఉదయం నిద్ర లేవగానే ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పటికే స్నానం, అల్పాహారం ముగించుకుని తోటలో నీరెండలో తోటివారితో కలసి కూర్చున్న తల్లిని చూడగానే అప్రయత్నంగా "అమ్మా!" అన్నాడు.
"రాజు! వచ్చావా" అంది. ఆమె మొహంలో ఎంతో ఆనందం....
"బాబీని తేలేదా...ఎలా వున్నాడురా"
"ఆదివారం తెస్తాలే...ఇక్కడ నీకు బావుందా?" అడిగాడు.
"నా దగ్గు తగ్గిందిరా... డాక్టర్ మందు పనిచేసింది" అంటూ ఏదో చెప్పబోయింది.
"సరే.....వస్తా" అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా గబగబా వెళ్ళిపోయాడు.
ఆ రాత్రి కూడా సగం నిద్రలో మెలుకువ వచ్చింది. ఖళ్ళుఖళ్ళు మని ఒకటే దగ్గు శబ్దం. లేచి కూర్చున్నాడు.వరండా లోకి వెళ్ళలేదు. సిగరెట్ వెలిగించాడు.ఏదో తెలియరాని రాగం దూరంగా,భారంగా వినిపిస్తోంది.భార్య, కొడుకు గాఢ నిద్రలో వున్నారు.

***

రోజులు గడుస్తున్నాయి. అప్పుడప్పుడు వెళ్లి తల్లిని చూసి వస్తున్నాడు. వెళ్లినప్పుడల్లా జిలేబి పొట్లం పట్టుకెళుతున్నాడు. తల్లి పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండటం గమనించాడు. ఓ ఆదివారం భార్య, పిల్లలతో వెళ్ళాడు. తన లాగే చాలామంది వచ్చారు. అక్కడున్న చాలామందికి ఏదో ఒక అనారోగ్యం వుండనే వుంది. కారణం వార్ధక్యం!

రాజు తల్లి ఉబ్బసానికి, కారణం చలి గాలి. చల్లదనం ఆమెకు పనికిరాదు. వెచ్చని వాతావరణం ఉండాలి. ఆశ్రమంలో గదులు పగడ్బందీగా ఉన్నాయి. కిటికీలు వేస్తే చాలు. బైట చల్లదనం లోనికి రావడం లేదు. డిసెంబర్ నెల ఆరంభం అయినా, చలి ఉధృతంగా పెరిగినా, ఆవిడకు పెద్దగా ఇబ్బంది కలగడం లేదు. రాజుకెంతో సంతోషం కలిగింది.

ఆశ్రమ వాసులకు కొంత పైకాన్ని తన వంతు కర్తవ్యంగా భావించి ఇచ్చాడు.  కానీ, వెళ్ళేటప్పుడు తల్లి చూసిన చూపు అతడిని వెంటాడ సాగింది. ఆ రాత్రి రాజుకి నిద్ర పట్టలేదు. ఎప్పుడో వేకువ జామున కొంచెం కునుకు తీసాడు.  ఆ కునుకులో ఓ కల వచ్చింది. నాలుగేళ్ళ అబ్బాయి ఉబ్బసం దగ్గుతో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అవుతుంటే, భుజాన వేసుకుని అటూ, ఇటూ తెల్లవార్లూ నిద్రపోకుండా తిరుగాడిన ఓ మాతృ రూపం కనిపించింది.తెలివి వచ్చాక, తన నాలుగేళ్ళ కొడుకు వైపు ఆత్రంగా చూసాడు. అమ్మ పక్కన వెచ్చగా, హాయిగా నిద్ర పోతూ కనిపించాడు.

ఇంతలో వరండాలో శబ్దం...దగ్గు శబ్దం...అవును  ఆ దగ్గు తన చిన్నప్పుడిదే...దగ్గుతున్నది తనే....ఒక్కసారిగా  "అమ్మా...."అని బాధతో ఛాతీ నిమురుకున్నాడు.

* * *

కార్పెంటర్ తో వరండాలోని గ్రిల్ డోర్, కిటికీలకు చల్లగాలి రాకుండా చెక్కలతో టైట్ గా బిగించే ఏర్పాటు చేయించాడు.

"ఇప్పుడు ఈ అనవసరం ఖర్చు ఎందుకు?" అడిగింది రాణి.
"అమ్మను తీసుకు వస్తున్నాను" చెప్పాడు సీరియస్ గా.
రాణి మౌనంగా పెదవి కొరుకుతూ ఉండిపోయింది.
ఆ సాయంకాలం ఆశ్రమ నిర్వాహకులు ఆశ్చర్యంగా రాజు వైపు చూసారు.
"ఇక్కడ ఏమైనా అసౌకర్యంగా ఉందా?"అడిగారు వాళ్ళు.
"అటువంటిదేమీ లేదు!" చెప్పాడు.

తరువాత తల్లి దగ్గరకు వెళ్లి, "అమ్మా! ఇంటికి వెళ్లిపోదాం" అన్నాడు.
"ఇక్కడ బాగానే వుంది!" అని అంది కానీ, ఆ మాటకే ఆమె ముఖం వెలిగిపోతోంది.
గబగబా ఆమె సామాన్లు సర్ది ఆటోలో పెట్టేసాడు.
ఆశ్రమంలో ఉన్న ఆమె తోటి వాళ్ళు "మళ్లీ ఎప్పుడొస్తావ్?"అని కొందరు, "ఇక్కడే బావుంటుంది" అని ఒకరు,"మీ కోడలు ఒప్పుకుందా?" అని ఒకరు అడగసాగారు. కొందరి మొహాలలో కాస్తంత ఈర్ష్య కూడా కనిపిస్తోంది.  అందరూ వీడ్కోలు చెబుతున్నట్లుగా గేట్ వరకు వచ్చారు.
ఆటో కదిలింది.

ఇంటికి రాగానే ఇరుగూ,పొరుగూ పలకరించారు,

"ఏ ఊరు వెళ్లావమ్మా?"అంటూ.

"నానమ్మా!" అంటూ పరుగున వచ్చి వాటేసుకున్నాడు మనవడు.

రాణి మౌనంగా వచ్చి అత్తగారి పెట్టె అందుకుని వరండాలో పెట్టింది. రాజు వెంటనే ఆటో తీసుకుని బేరాల కోసం వెళ్ళిపోయాడు. ఎనిమిది గంటల ప్రాంతంలో  తిరిగి వచ్చేసరికి, తల్లి భోజనం చేస్తోంది. రాణి దగ్గర ఉండి వడ్డిస్తోంది.  భోజనం అయ్యాక వరండాలో మంచం మీద కూర్చుంది.

రాజు తెచ్చిన జిలేబి పొట్లం బాబీ నానమ్మకి ఇచ్చాడు.

ఆ రాత్రి నిద్రపోయేముందు వరండాలోకెళ్ళి చూసాడు.

గది వెచ్చగా ఉంది.

"చలి గాలి లేదు కదమ్మా?"అడిగాడు తల్లిని.

"బాగానే ఉందిరా...నువ్వు మాత్రం ... చలిలో రాత్రి పూట ఆటో తిప్పకురా!" అంది నిద్రకుపక్రమిస్తూ.

తల్లికి దుప్పటి కప్పడంలో సాయం చేసాడు.

ఆ రాత్రి ఏ శబ్దం వినబడలేదు.

దగ్గు శబ్దం అసలే వినబడలేదు. ఏదో గుండెలోని బరువు దిగిపోయినట్లుగా, తేలిక పడిన మనసుతో ఎంతో హాయిగా నిద్రపోయాడు.

* * *

కథా మంజరి



# గతితర్కం

**పోతూరి సునీత**

***"ఏ బాహ్యబలం పనిచేయకపోతే నిశ్చలస్థితిలో ఉన్న వస్తువు అదే స్థితిలోనూ, సమవేగంతో ఋజుమార్గంలో గమించే వస్తువు అదే గమనస్థితిలోనూ ఉండిపోయే వస్తువు ధర్మాన్ని జడత్వంఅంటారు. (Inertia)"***

ఈ సూత్రం నాకు నూరు పాళ్లూ వర్తిస్తుంది. ప్రతిరోజు నా ఉదయపు నడక ఎప్పుడు గతంలోకి జారిపోయిందో గమనింపే లేకపోయింది. లాక్డౌన్నా జీవనగతిని మార్చేసింది అంటే నమ్మాలి. వలస కూలీల దయనీయమైన పరిస్థితిని రోజు వార్తల్లో వింటూ, చదువుతూ మనసు చేదెక్కిన అనుభవం. పెదవులైనా దాటని నాసానుభూతి, ఇంటి నాలుగుగోడల మధ్యే ఆవిరయిపోతోంది! ఈ నిస్సహాయత ఎంతో అశాంతిని కలిగిస్తోంది. నిస్సారంగా జీవితమూను. కాని, అది మారడానికి నేను ఏ ప్రయత్నమూ చేయటం లేదు. దానికీ సమయం రావాలేమో?

'ట్రింగ్.. ట్రింగ్...' అంటూ ఫోన్మోగింది. అది నా సెల్ఫోన్. నాకిష్టమైన రింగ్టోన్. సజీవమైన క్షణాలేవో ముందు నిలిచినట్లు వుంటుంది వింటూంటే!!

వైజాగ్నుంచి రాఘువ.

"సత్యం ఎలా ఉన్నావురా?"

"దివ్యంగా...! మీరంతా ఎలా ఉన్నారు? వైజాగ్లో గాస్లీకేజి అదీ..."

"అబ్బేబ్బే. మన వైపు కాదులే .."

"వెంటనే ఫోన్చేద్దామని.." నా మాట నాకే పేలవంగా వినిపించింది. నేనాపనిచేయందే..!

"అదంతా ఓకే. నువ్వు అర్జంటుగా ఓ సాయం చేయాలి! సాములు అని మనూరే. హైదరాబాదు వచ్చాడు ఎవరో పేషెంటుకి తోడుగా.. బసవతారకం హాస్పిటల్ అనుకుంటా! అతను కుకటపల్లిలో చిక్కడిపోయాడు. వెనక్కి రావాలంటే లాక్డౌనూ. కాస్త సాయంచేయగలవా?"

గతుక్కుమన్నా! నేను ఉండేది మియాపూర్. కాని ఈటైంలో ఎలా? సాధ్యమయ్యే పనేనా?

"ఏంటాలోచిస్తున్నావ్? ఆబ్లిగేషన్ అనుకో, ఏమన్నాఅనుకో. అక్కడ అతనికో ఎమర్జెన్సీ. అతని నెంబర్ ఇస్తున్నాను! వాట్సాప్చేస్తాలే, సాయంత్రానికి నాకు అప్డేట్ ఇయ్యి. ఉంటా!" మరో మాట లేకుండా చరవాణి వాణి తుంచేసాడు.

రాఘువ నా చిన్ననాటి స్నేహితుడు. 'నీతోపని' అని ఎవరైనా అంటే శక్తివంచన లేకుండా సాయాని కివస్తాడు. అలాగే ఎదుటవాళ్లతోనూ చేయించుకోగలడు. ఈమధ్యే మా స్నేహితులను అందర్నీ కూడగట్టి వాట్సప్ గ్రూప్ తయారుచేసాడు. ఒకరి బాగోగులు ఒకరు ఆరా తీసుకుంటూ, కొత్తల్లోఅదో 'లైవ్ మూవ్మెంట్ , ఇప్పుడు ఆ హడావుడి లేదు.

బలవంతంగా నెట్టబడినట్టు ఇప్పుడు ఒక్కకుదుపు.  ఎలా సహాయం అందించడం?  గొప్ప చిక్కేనే.. తప్పదుగా.  మనసులోనే మధనపడుతూ, సాములికి ఫోన్చేసాను.  వెంటనే తీసాడు అతను "ఆయ్..! మీరు ఫోన్చేత్తారని రాగవగారు సెప్పారండీ.." అంటూ చెప్పుకు పోయాడు.
ఇంతకీ అతని పేరు సాములు కాదట సామ్యూల్.  సొంతూరు రాజమండ్రిట.   తనను తోడు తెచ్చుకున్న పేషెంట్  బంధువింట్లో ఉండిపోయాడుట.  తనకేమో వలస కార్మికుల కోసం ఏర్పాటు చేసిన కేంపులో ఎలాగో చోటు దొరికిందిట.   ఆ రోగితో వచ్చి ఇలా ఇరుకున పడ్డందుకు బాధపడ్డాడు.   తెచ్చుకున్న డబ్బూ అయిపోయిందిట.  ఓ రోజైతే తిండికూడా దొరకలేదు. ఎవరో ఆహార పొట్లాలు, మంచినీళ్లూ ఇచ్చారుట.  దాదాపు విలపిస్తూ చెప్పాడు.  ఎవరో అన్నట్టు రోగభయం, మృత్యుభయం, బయటకు వస్తే పోలీసువారి చేతిలో లాఠీదెబ్బలు.. దెబ్బ తగిలిన పావురంలా వణికిపోతూ అతను!
నాకూ జాలివే సింది. “నాకు చాతనైన సాయం చేస్తాను అధైర్యపడవద్దు” అని చెప్పాను. కాని ఎక్కడ నుంచి ఎలా మొదలుపెట్టాలి?   నా కొలీగ్ శ్రీనివాసరావు కూడా రాఘువలా పలుకుబడి,  ఉపకారబుద్ధీ ఉన్నవాడే. కాని అతనిప్పుడు దేశంలోనే లేడు.  ఇప్పుడెలా?
ఇలా ఆబ్లిగేషన్లో పెట్టినందుకు  రాఘువ మీద కించిత్ కోపం వచ్చింది.  ఆలోచనలతో సన్నగా తలనొప్పి మొదలైంది.
"అదేమిటి అలా ఉన్నారు?" కాఫీ ఇస్తూ అడిగింది రాజీ.  ఇరుకున పడేసిన రాఘువని తిట్టుకుంటూ, విషయం చెప్పాను.
"ఆమాత్రం సాయం చేయలేరా?" విస్తుపోతూ అడిగింది.
“అదే ఎలా అనే? ముందు అతనికి ఏజ్వరమూ లేకుండా వుండాలి.  ఆతర్వాత పోలీసులు దగ్గర పెరిమిషన్ తీసుకోవాలి.  నాకిది తలకు మించిన పని కాదా?” చిరాగ్గా అన్నాను.
"వేణుకిఫోన్చేద్దాం." రాజీ సలహా ఇవ్వగానే ...
‘అవును కదా!వేణు ఇలాటి సాయం చేయగలడు!’ అని అనిపించింది.
వేణు తన మేనల్లుడు.  అతనేదో ఎన్జివోకి పని చేస్తాడు. ఫోన్చేసిన వెంటనే దొరకలేదు. దొరికాక వివరాలు అడిగాడు.  ఫోన్నెంబర్ ఇచ్చాను.  “అంతా నేను చూసుకుంటా..  నిశ్చింతగా ఉండండి” అన్నాడు. మధ్యాహ్నం భోజనం అయ్యాక చిన్నకునుకు కూడా తీశాను.  ఫోను వచ్చిందంటు తను తట్టి లేపేదాక మెలకువ రాలేదు.   చాలా మిస్సేడ్ కాల్స్  ఉన్నాయి.   రాఘువ.. శామ్యూల్.. ఆఖర్న వేణు.

ముందు వేణుకి చేసాను. "అంతా ఓకే మావయ్య .. మీ సామ్యూల్ని కలిసాను.   ఏర్పాట్లు జరిగాయి. మళ్ళీ చేస్తా..  కాస్త పని వుంది!" అంటూ వెంటనే పెట్టేశాడు. కాస్త మనసు స్థిమిత పడింది.

రాఘువ తనే ఫోన్చేశాడు. "చాలా చాలా థాంక్స్ రా సత్యం! మాట సాయంతో పాటు డబ్బు సాయం చేసావుట.  ఆ భగవంతుడు నిన్నూ, నీ కుటుంబాన్ని చల్లగా  చూస్తాడు.." అతని ధోరణిలో పొగడ్డం మొదలు పెట్టాడు.   'ఏదో చాతనయినది..” అంటున్నానే కాని,  ‘డబ్బేం సాయం చేసినట్టు చెప్పలేదే!’ వేణు ఫోనులో మాటలాడిన విషయాలు గుర్తుకు తెచ్చుకున్నాను.

ఆ రాత్రి వేణు మళ్ళీ ఫోన్చేసి చెప్పాడు.. సామ్యూలులా చాలామంది ఆ కాంప్లో వున్నారు. అందరికీ కలిపి పోలీసు పర్మిషన్ తీసుకుని, ఓ ట్రక్కు వేశారుట.. ఈ రాత్రికే బయలుదేరి వెడుతుందిట. సామ్యులుకి ఐదువేలు అవసరపడితే ఐదువేలు ఇచ్చాడుట.
ఆ డబ్బులు నేను ఆన్లైన్లో తనకి ట్రాన్స్ఫర్ చేస్తానని చెప్పాను.
"అక్కర్లేదు మామయ్యా! ఆడబ్బు నువ్విచ్చినదే" అన్నాడు.
'నేనిచ్చినదా? ఎలా?' ఆలోచనలోపడ్డాను. రాజీతో చెబితే, నెల్లాళ్ల కిందట జరిగిన విషయం గుర్తు చేసింది. అదెలామరచిపోయాను?
వలస కూలీల కోసం పని చేస్తున్న తమ ఆర్గనైజేషన్కు మమ్మల్ని తోచిన ఆర్ధిక సహాయం చేయమని మెసేజ్పెట్టాడు వేణు. వాళ్ల సేవా కార్యక్రమాల ఫోటోలు కొన్ని జతచేశాడు.
పదివేలు ఇద్దామని అన్నాను. తను నవ్వింది. కనీసం ఒకలక్ష ఇవ్వలేమా అన్నది. నిజానికి మాకు ఆర్ధిక ఇబ్బందులు ఏవీలేవు. నా కొడుకులు ఇద్దరూ విదేశాల్లో స్థిర పడ్డారు. కానీ ఎక్కడో చిన్న సందేహం. ఆ ఇచ్చేది 'ప్రధానమంత్రి సహాయనిధి' కి పంపుదామని అన్నాను. తనేం మాటాడలేదు, కాని తనకి సమ్మతం కాదని అర్ధమయినా, నేను అనుకున్నదే అతనికి ఫోన్చేసి చెప్పాను.
"ఎందుకు మామయ్యా, ఆ ఇచ్చే లక్షరూపాయలు ఇక్కడే ఇవ్వచ్చు గదా? మీ పేరు చెప్పుకొని వేలాదిమంది సాయం పొందుతారు!" అన్నాడు. ఇంకా చాలా చెప్పాడు. రాజీ అతని మాటే బలపరచింది. ఇక తన మాట తోసిపుచ్చలేక పోయాను. అనుకున్న సంఖ్యకు మరో సున్నా అధికంగా చేరుస్తుంటే, చెప్పద్దూ.. చిన్నతడబాటు.

ఇది జరిగి దాదాపు నెలరోజులైంది. అదింకా కూర్చుందా? నాకిప్పుడే అనుమానాలూ లేవు. ఇప్పటిది వెనక్కి ఇచ్చేయ్యాలి.
జరిగినదంతా విని రాజీ అంది " మదర్థెరీసాఅన్నట్టు ప్రార్ధించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న. మనకీ అవకాశం ఇచ్చిన భగవంతునికి కృతజ్ఞత చెప్పుకోవాలి!"
కాని నాకో నిజం ద్యోతకమైంది.. ఈ మొత్తం వ్యవహారంలో లబ్ధిదారుడిని నేనే. నేనే ఋణపడి ఉండాలి అందరికీ...
తొలకరి వానలకి చిగుళ్లు తొడిగిన కొమ్మలలాగే, అనుకోని విధంగా దిశ, గమనమూ మారి జీవితం మళ్ళీ కొత్తగా ఉల్లాసంగా అనిపించడం మొదలైంది.

* * *

# అ ర్ర ర్రే !!



**శ్రీ బాడిశ హనుమంత రావు**

హైవే మీద అప్పుడప్పుడూ ఒకటీ అరా వాహనాలు జుయ్..జుయ్ మంటూ వెళ్తున్నాయి. ఆ రోడ్డు మీదనే ఉన్న రాయన్నగూడెం... సుర్యాపేట తరువాత వచ్చే ఊరు, ఆ ప్రసుప్త సమయంలో... నిద్రలో జోగుతోంది. కానీ నిద్ర పట్టక లేచాడు సైదయ్య.

తల ఎత్తి ఆకాశంలోకి చూస్తూ... చుక్కల జాడతో... 'తెల్లవారు ఝాము, సమయం నాలుగు గంటలు అయియుంటదనుకుంటూ...' కుక్కి మంచంలో నుండి లేచి, మంచం కింద పెట్టిన చేతి కర్ర తీసుకుని ఇంటి ముందు పెనగడి తీసుకొని బయటి అరుగు మీదికొచ్చి కూచుని, ఖద్దరు బనీన్ జేబులో నుండి చుట్ట, అగ్గిపెట్టె బయటికి తీశాడు. అగ్గిపుల్ల వెలిగించబోతుండగా... రోడ్డు మీది నుండి రెండు కాంతివంతమైన లైట్లు ఉన్నట్లుండి పైకి లేచి, చా...లా... పెద్ద సైజు మిణుగురులు ఎగిరినట్టు ఎగిరి, రోడ్డు పక్కన పడి భళ్లున పగిలిపోయాయి. ఉలిక్కిపడ్డ సైదయ్య వేళ్ల మధ్య ఉన్న చుట్ట జారిపడింది....

"ఓరి రాములో... ఓ పాలి యిటు రా...." వాకిట్లో పడుకొని ఉన్న తన కొడుకుని కేకేశాడు.

ఇద్దరూ కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ వాళ్ల ఇంటి పక్కనున్న ఖాళీ స్థలం దాటి, ఆ పక్కనున్న స్కూలుని దాటి ఆ చోటు దగ్గరికి వెళ్లారు. మసకగా ఉన్న చీకటిలో వాళ్లకు రోడ్డు పక్కన కుదిమట్టంగా పడిన కారు కనపడింది. కారు ముందు సీటులో ఎవరో వ్యక్తి కదులుతున్నట్టు అనిపించేసరికి, ఇద్దరూ గట్టిగా కేకలు వేశారు. ఈ గోలకు దగ్గరలో ఉన్న ఇళ్లలో నుండి నలుగురు అయిదుగురు వచ్చి గుమికూడారు. సెల్ ఫోన్ ల ఫ్లాష్ లైట్స్ వేసుకొని చూశారు. ఈ హడావుడికి ఇంకో పిడికెడు మంది కూడా వచ్చారు.

వేగంగా వస్తున్న కారు, రోడ్-డివైడర్-ను చూసుకోక జరిగిన ప్రమాదం. కుడి వైపు చక్రం డివైడర్ ను ఎక్కి మూడు పల్టీలు కొట్టి, రోడ్డు పక్కన నాటిన మొక్కల మధ్యన పడింది. పడటం పడటమే అద్దాలు, లైట్లు పగిలిపోయాయి. కష్టం మీద ముందు సీటులో ఉన్న వ్యక్తిని బయటికి లాగారు.

కారులో ఉన్న వ్యక్తి తలకు తీవ్రమైన దెబ్బ తగిలింది. కుడికాలు బ్రేక్ కింద ఇరుక్కుని, విరిగిపోయి, వేలాడినట్టు అయింది. ఇదంతా మొబైల్-లో వీడియో తీయబోతున్న ఒకతన్ని సైదయ్య... ' ఎదవలు, ఏ సమయంలో ఏమి చెయాలో తెలిసి చావదా?' అని కసురుకున్నాడు. వాళ్లలో ఒకరు నూటాఎనమిదికి

ఫోన్ చేశారు. ఓ గంటలో అతన్ని తీసుకుని ఆ వాహనం ఏరియా అసుపత్రికి తీసుకుని వెళ్ళిపోయింది. గుమిగూడిన అందరి నోటా ఒకటే మాట... 'ఆసుపత్రికి తీసుకొని వెళ్లిన మనిషి బతకడం కష్టం'... అని.

ఓ గంట తర్వాత అక్కడెవరూ లేరు!!

-0-

ఏరియా అసుపత్రికి తీసుకెళ్ళిన సిబ్బంది, విధిలో భాగంగా పోలీస్ స్టేషన్ కి విషయం తెలియపరిచారు. డ్యూటీ డాక్టర్, ఫస్ట్ ఎయిడ్ చేశాడు. కుడికాలు ఫ్రాక్చర్ అయింది. కానీ సివియర్ హెడ్ ఇంజ్యురీ కారణంగా గాయపడిన వ్యక్తి కోమాలోకి వెళ్ళినట్టు గుర్తించాడు. పెద్దాసుపత్రికి రిఫర్ చేస్తూ... అదే విషయాన్ని ఎడ్మిట్ షీట్ లో రాశాడు.

ఇంతలో వచ్చిన కానిస్టేబుల్ క్షతగాత్రుడి జేబులో ఉన్న మొబైల్ తీసుకొని, చివరగా డయల్ అయిన నెంబర్ కి కాల్ చేసి ప్రమాదం సంగతి తెలియచేసి, ఆ ఖరీదైన మొబైల్ ని స్విచ్ ఆఫ్ చేసి జేబులో వేసుకొని 'పని పూర్తయిందన్నట్లు' వెళ్ళిపోయాడు. ప్రతీ ప్రమాదాన్ని ఎఫ్.ఐ.ఆర్ చేయడం సాధారణంగా జరగదు మరి. సమాచారం అందుకున్న సంబంధీకులు అసుపత్రికి చేరుకొని, అతన్ని తీసుకెళ్లిపోయారు.

-0-

ఆ ఊరి చివరలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల గేటుకి వంద మీటర్ల దూరంలో పడి ఉందా కారు. ఉదయం తొమ్మిది దాటుతుండగా...

పిల్లలు బడికి వస్తున్నారు. అందులో ఇద్దరు మిత్రులు ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకొని, నడుచుకుంటూ వస్తున్నారు. అందులో ఒకడు...

"అరేయ్, పొద్దున్న బడి దగ్గర యాక్సిడెంట్ అయిందంటరా"

"అవునా చూసొద్దామా?"

"ఇప్పుడొద్దు ప్రార్థనకు ఆలిసెం అయిద్ది. ఇంట్రెల్లో పోదాం" అనుకున్నారు.

అనుకున్నట్టుగానే ఇంటర్వెల్ లో ఆ పిల్లలిద్దరూ కారు వద్దకు వచ్చారు. దాని చుట్టూ తిరిగారు. ముందు సీట్లపై ఉన్న రంగు రంగుల పూసలు వివిధ సైజుల్లో ఉన్నవి వాళ్లకు బాగా నచ్చాయి. చెరొకటీ తీసుకొని తరగతి గదుల్లోకి చేరి, చుట్టూ ఉన్న వాళ్లను గర్వంగా చూశారు. ముద్దుగా ఉన్న పూసల కవర్లను కింద

వేసుకొని, వాటిపై కూచున్నారు. వాటిని చూడటంతోనే అందరూ పిల్లలు వాళ్ల చుట్టూ 'భలే..భలే..' అనుకున్నారు.

పగలు భోజనం సమయం కాగానే.. పిల్లలందరూ నిధి అన్వేషణకు కారు దగ్గరకు బయల్దేరారు. కారుని స్వేచ్ఛగా ముట్టుకొని చూశారు. అంతకు ముందు ఎప్పుడూ ముట్టుకొని ఎరుగరు మరి. డోరు తీసి ఎక్కి కూచున్నారు. ఎగిరారు, స్టీరింగు తిప్పారు. ఏమి చేయాలనుకుంటే అది చేశారు. వాళ్ల బడికి ఏ బండి వచ్చినా దాన్ని ముట్టుకుంటే యజమానులు ఊరుకునేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు ఎవరూ అడ్డు చెప్పే వాళ్లు లేరు.

కాసేపటికి ఒకరికి ఆలోచన వచ్చి డ్యాష్ బోర్డు మీద ఉన్న దేవుడి బొమ్మ పీకి లాగు జేబులో పెట్టుకున్నాడు. అది చూసిన ఇంకొకరు ముందు బాక్స్ లో ఉన్న నీళ్ల సీసా తీసుకున్నాడు. మరొకరు స్టీరింగ్ కవర్ ఊడబీకి దాన్ని పట్టుకొని..."డుర్...డుర్...డుర్ర్..." అని కారు తోలుతున్నట్టు చేయసాగాడు. వెనుక సీట్లలో ఉన్న టవల్స్ తో సహా పిల్లలు తీసుకోగలిగినవన్నీ... ఎవరికి నచ్చినవి వారు తీసుకున్నారు.

ఈ లోగా అటునుండి పొలాల వైపు వెళుతున్న కొందరు పెద్దలు పిల్లలను గద్దించారు. ఆ గద్దింపునకు బెదిరి ఓ వారం రోజుల పాటు కారు జోలికి పిల్లలెవరూ వెళ్లలేదు. కానీ ఈ సారి నిధి అన్వేషణ పెద్దల వంతయింది.

ఓ మూడు వారాలయ్యేటప్పటికీ, ఆ కారులో ఊడి వచ్చే ప్రతీ భాగానికి కాళ్లొచ్చాయి. రమాదేవి వాళ్లాయన రెండు టైర్లు పీక్క పోయి, సగం భూమిలోకి పాతి బర్రెలు కట్టేశాడు. వీరమ్మ వాళ్లాయన ఏకంగా సీట్ల స్పాంజి పీక్కొచ్చి, ఇంట్లో ఉన్న ఇనుప కుర్చీలకు కట్టి వాటిని సోఫాల మాదిరిగా మార్చేశాడు. నాంచారయ్య వాళ్లకు నాలుగు చక్రాల పుణ్యమా అని కింటా ఉల్లిగడ్డలు వచ్చాయి.

'అయ్యో... అనవసరంగా భయపడ్డాము, కనీసం పుల్లయినా పొందలేకపోతిమే' అనుకున్నవాళ్లూ ఉన్నారు. అయిదు నెలలయ్యేటప్పటికి, ఆ కారుకి రంగు కూడా పొట్లిపోయి తుప్పు పట్టడం మొదలయ్యింది. ఇప్పుడు అందులో ఫలానా పేరున్న అవయవం అనేది ఏదీ లేదు... ఉత్త అస్థిపంజరం తప్ప. ఉత్తరోత్తరా రెండు ఊర కుక్కలకు రెండు పడక గదుల ఆవాసంగా మారింది.

స్కూలుకి ఎదురుగా ఉన్న కోటయ్యకి, అతని సావాసగాడు మరియు ఊరి సర్పంచి, వెంకన్నకూ... ఈ కారు ఇలాగే వదిలేస్తే తుప్పు పట్టీ...పట్టీ... మన్నై పోద్దనే బెంగ పడింది. పాత ఇనుప సామాను కొనే గోపయ్యకు కబురు చేశారు. అతనూ వచ్చి చూశాడు. ఎవరికీ సొంతం కాని వస్తువు కాబట్టి, అడ్డికి పావు

శేరు బేరం మొదలెట్టాడు. చివరాఖరికి పదిహేను వేలకు బేరం కుదిరింది. రేపు వచ్చి తీసుకుపోతానని ఓ అయిదు వందలు బజానాగా ఇచ్చి వెళ్లిపోయాడు.

కానీ... మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు... ఓ కారు వచ్చి ఆ తుప్పు పట్టిన కారు దగ్గర ఆగింది. అందులో నుండి ఒకతను దిగాడు. తలకు, కాలుకి బ్యాండేజ్ వేసి ఉంది. చేతిలో హ్యాండ్ స్టిక్, కళ్లకు నల్ల కళ్లజోడు. అతను నెమ్మదిగా కుంటుకుంటూ సైదయ్య దగ్గరకి వచ్చాడు. ఇద్దరూ కలిసి పాత కారు దగ్గరికి వచ్చారు.

కారు సామాను పీక్కున్న వారు ఎవరూ అక్కడికి వచ్చే ధైర్యం చేయలేదు... కానీ, వీసమెత్తు సామాను కూడా దక్కని వారు మాత్రం ధైర్యంగా వచ్చి నిలబడ్డారు. విషయం తెలిసిన సర్పంచ్ గానీ, కోటయ్య గానీ అక్కడకు వచ్చే సాహసం చేయలేదు. వాళ్లని చూసి అప్పటి వరకూ... కారులో ముడుచుకున్న ఊర కుక్కలు గుర్ గుర్ మంటూ దూరంగా పోయి, నిలబడి ఇల్లు జప్తు చేస్తుంటే దీనంగా నిలబడి చూస్తున్న బైతుల్లా చూస్తున్నాయి.

'అందరికీ అర్థమైంది. నెలల కింద ఆ కారు ప్రమాదంలో గాయపడింది అతనే అని. కొన్నాళ్లు కోమాలో ఉండి, ఈ మధ్యనే బయట పడ్డాడు. ఆఘమేఘాల మీద వచ్చాడు.'

అతను ఫోన్ చేయగానే అప్పటి దాకా కారులో ఉన్న ఇద్దరూ... ఓ వెల్డింగ్ మిషన్ తీసుకుని కిందకి దిగి, కారు వద్దకు వచ్చారు. టక, టకా పని మొదలెట్టారు. కారు వెనుక సీటు ఉండే ప్రదేశంలో, కత్తిరించి, ఓపెన్ చేశారు. లోపల నుండి ప్లాస్టిక్ కవర్ చుట్టి ఉన్న బండిల్స్ తీశారు. బండిల్ మూలలను చించి చూశారు. అన్నీ పెద్ద నోట్లు... మొత్తం ఒక కోటీ యాభై లక్షలు. చుట్టూ ఉన్న వాళ్ల కళ్లు చెదిరిపోయాయి. వాళ్లు మాత్రం, ఒక కట్ట సైదయ్య చేతిలో పెట్టి, మిగిలిన పార్సిల్స్ ని వచ్చిన కారులోకి మార్చుకొని వెళ్లిపోయారు. చేతిలో ఉన్న డబ్బుల కట్ట చూసేసరికి, సైదయ్యకు నిలువు గుడ్లు పడ్డాయి.

అందరూ పరిచయస్తులు కావడంతో, భయం లేకుండా... తోకలు ఊపుకుంటూ... ఊర కుక్కలు ఎప్పటిలా తమ ఆవాసాన్ని అక్రమించాయి. ప్రశాంతంగా, ఏ టెన్షన్ లేకుండా ముడుచుకున్నాయి. కానీ...

అక్కడ నిలబడి ఉన్న వాళ్ల నోళ్లు తెరిచినవి తెరిచినట్టే ఉండిపోయాయి. అనిమేషంగా బిగుసుకుపోయారు. పది నిమిషాల్లో ఈ వార్త పాకింది. ఊరు ఊరంతా నోరు తెరిచింది. ఎప్పుడు ఆ నోరు మూస్తారో తెలియదు!!

-00-



# స్నేహ

శ్రీ అంగర వెంకట శివప్రసాద రావు

'స్నేహ' పేరుకు తగ్గట్టే మంచి స్నేహితురాలు. నాక్కాదు. మా అబ్బాయికి. మావాడు బోట్స్వానాలో ఉద్యోగం చేస్తున్నాడు. అది దక్షిణాఫ్రికాలో లేదు. కానీ అది కూడ ఆఫ్రికా దేశమే. అతి తక్కువ జనాభా వున్నా .. ఏ విదేశానికీ తీసిపోదు. చాలా చక్కటి సంస్కారమున్న దేశం. క్రమశిక్షణలో ఏ విదేశానికీ తీసిపోదు.

మా అబ్బాయి, స్నేహ భర్త పని చేస్తున్న కంపెనీలోనే పని చేస్తున్నాడు. ఆమె అక్కడ ఒక కాన్వెంటులో టీచరుగా పని చేస్తోంది. మా వాడ్ని వాళ్లే ముందుగా పరిచయం చేసుకుని, కొన్నాళ్ల పాటు వాళ్లింట్లో పేయింగ్ గెస్టుగా వుంచుకున్నారు కూడా. ఆ తరవాత మా వాడికి పెళ్లై వేరే కాపురం పెట్టేవరకూ వాళ్ల తోటే వుండేవాడు. వాళ్లకి పిల్లలు లేరు. పెళ్లైన ఏడాదికే మా వాడికి కొడుకు పుట్టాడు. వాళ్లకే పుట్టినట్టు తెగ సంబరపడ్డారు. మా మనవడ్ని ఒక్క రోజు కూడ చూడకుండ వుండేవారు కాదు. స్నేహైతే మా మనవడ్ని కింద దించేది కాదు. మా కొడుకు, కోడలు అఫీసులకెళ్ళిపోతే మా మనవడ్ని ఇంట్లో పనమ్మాయి దగ్గర వదిలేసేవారు. స్నేహ స్కూలు నుండి రాగానే తనే మా వాళ్ల యింటికొచ్చి పిల్లవాణ్ణి తన యింటికి తీసుకెళ్ళిపోయేదట. వాళ్లది పక్క యిల్లే కావడంతో పెద్ద సమస్య వుండేది కాదట.

ఇవన్నీ మా కొడుకు, కోడలు మాకు ఫోనులో చెప్తుండేవారు. ఒకసారి స్నేహని వీడియో కాల్లో పరిచయం చేసాడు మావాడు. చాలా కలుపుగోరుగా మాట్లాడింది మాతో.

స్నేహ అత్త మావలు బొంబాయిలో వుంటారట. ఒకమారు వాళ్లు వాళ్ల దేశం తీసికెళ్లారట. రెండు నెల్లకే తిరిగి బొంబాయి వచ్చేసారట.. అక్కడ వుండలేక! వాళ్లకి స్నేహ భర్త ఒక్కడే సంతానమట. అయినా అతని దగ్గర వుండలేకపోయారట. స్నేహ వాళ్లని ఎంతో జాగర్తగా చూసేదట. వాళ్లకీ స్నేహంటే ఎంతో అభిమానమట. వాళ్లిద్దరూ ఎంత బతిమాలినా అక్కడ వుండడానికి వాళ్లు యిష్ట పడలేదట.

వాళ్లిద్దరూ అక్కడ వుద్యోగాలు మానేసి బొంబాయి వచ్చేసారట పెద్దవాళ్ల కోసం.

ఇదీ స్నేహ గురించి మావాడు చెప్పిన విషయాలు. ఇదెందుకు చెప్పవలసి వచ్చిందంటే .. మేం కూడ ఆ మధ్య మా వాడి దగ్గరకి రమ్మంటే వెళ్లాం. మా ప్రయాణం విశాఖ నుండి బొంబాయికి, అక్కడ్నించి అడీస్ అబాబా కి, అక్కడ్నించి .. మావాడి దేశానికీ .. మొత్తం మూడు విమానాలు మారి వెళ్లాలని చెప్పాడు మా వాడు. బొంబాయిలో మేం సాయంత్రం అయిదు గంటలకి విమానం దిగాం. మర్నాడు తెల్లవారు ఝామున మా ఫ్లయిట్ అడీస్ అబాబాకి. మమ్మల్ని బొంబాయి విమానాశ్రయంలో సాయంత్రం కలుసుకుని, మళ్లీ అర్ధరాత్రి మమ్మల్ని విమానాశ్రయంలో దించడానికి స్నేహ వస్తుందని మా అబ్బాయి చెప్పాడు.

స్నేహని మేం ఒకసారి వీడియో కాల్లో చూసాం కాబట్టి గుర్తుపట్టడం పెద్ద కష్టం కాలేదు మాకు. కాకపోతే ఆమె వేష ధారణలో కొద్దిగా మార్పు వచ్చింది. బాబ్ హెయిర్ .. పొట్టి గౌను, హైహీల్సు .. మనిషి పొట్టిగా వున్నా, నవ్వుతూ మమ్మల్ని ఎన్నాళ్ల బట్టో పరిచయం వున్నట్టు పలకరించి, మా చేతి సామాను అందుకుని మమ్మల్ని దగ్గర్లో వున్న హోటలుకి ఆటోలో తీసుకెళ్లింది. దారి పొడుగునా మా మనవడి కబుర్లే. ఆ తరవాత

అర్ధరాత్రి మమ్మల్ని విమానాశ్రయంలో దించి వెళ్లిపోయింది. మేం మా అబ్బాయి దగ్గర వున్నప్పుడు ఆమె ప్రస్తావన చాలా సార్లు వచ్చింది మా వాళ్ల దగ్గర ఏదో విషయంలో. మంచి స్నేహితురాలని మావాళ్లు చెప్పగా విన్నాము. మా తిరుగు ప్రయాణంలో ఆమెని కలవలేదు.

మేం మా అబ్బాయి దగ్గరకి వెళ్లి మూడేళ్లవుతోంది. మా వాళ్లు మధ్యలో ఇండియా వచ్చినా స్నేహని బొంబాయిలో కలవలేదని చెప్పాడు. ఈ మధ్య కాలంలో ఆమె విషయం మేం పూర్తిగా మర్చిపోయేం.

కరోనా మహారాష్ట్రలో విలయతాండవం చేస్తోందని తెలిసి, సడనుగా బొంబాయిలో స్నేహ ఎలా వుందోననే విషయం గుర్తుకొచ్చింది మాకు. మా అబ్బాయితో కూడ ఆ విషయం అడగలేదు. నా ఫోనులో స్నేహ ఫోన్నెంబరు వెతికి పట్టుకున్నాను.

ఫోను చేసాను. చాలాసేపు రింగయ్యింది. నేను వదలకుండా అలానే పట్టుకు వున్నాను. చాలాసేపటి తరవాత అవతల ఎవరో మగవాళ్లు స్నేహ ఫోనెత్తారు. బహుశా ఆమె భర్త అయివుంటాడు.

'హలో' అన్నాడు అతను.

'స్నేహ వుందా?' అడిగాను. ఫోను గరగర లాడుతోంది. నా మాట అతనికి వినిపించిందో .. లేదో ..

'ఆమె .. లేదిక్కడ ..' అతని గొంతులో ఏదో తెలియని విచారం తొంగి చూసింది.

'ఎక్కడుంది ఆమె?' అడిగాను ఆత్రుతగా ..

'ఎవరు మీరు?' అడిగాడు అతను.

నేనెవరని చెప్పాలి? ఏమని చెప్తే అతనికి అర్థమవుతుంది.

'ఇంతకీ మీరెవరు?' అతను రెట్టించి అడిగాడు.

'ఆమె .. ఆమె .. మా అబ్బాయి స్నేహితురాలు ..' అన్నాను.

'ఆమె హాస్పిటల్లో వుంది.' ఈమారు అతని గొంతులో దుఃఖం స్పష్టంగా వినిపిస్తోంది.

'ఆమెకేమైంది?' నేను వూహించినా.. అది కాకూడదని అనుకుంటూనే అడిగాను నేను.

'ఆమెకి కరోనా సోకింది.' ఈమారు అతని గొంతు పూడుకుపోయింది.

'కరోనా !!!! .. ఎలా జరిగింది?' అడిగాను.

అతను నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు. ఫోను పెట్టేసాడు.

నేను చాలా సేపు మనిషిని కాలేకపోయాను. స్నేహ నాకేమవుతుంది? అంత మంచి మనిషి .. అలాంటి మహమ్మారి జబ్బు సోకడమా! నా మాటకి నాకే నవ్వొచ్చింది. కరోనాకి దయా జాలీ వుండవు. మంచి, చెడ్డా తెలీవు. మనుషుల్ని అల్లుకుపోవడమే.

ఆ విషయం నా భార్యకి చెప్పాను. నాకంటే ఆమే ఎక్కువగా రోదించింది. ఆమె భోరున ఏడ్చేసింది.

'అబ్బాయికీ విషయం తెలుసో లేదో ..' ఆమే అంది కొంత తేరుకున్నాక.

'తెలిసే వుంటుంది. మనకి చెప్పడం ఎందుకని వూరుకుని వుంటాడు.' అన్నాను నేను. మా అబ్బాయి ఫోను కలవలేదు.

నాలుగు రోజుల తరవాత 'ఆమెకి ఎలా వుందో కనుక్కోండి ఫోను చేసి' అంది తనే.

స్నేహ ఫోనుకే మళ్లీ ఫోను చేసాను. ఈ మారు వెంటనే అతనే ఫోనెత్తాడు.

'స్నేహకి ఎలావుంది?' అడిగాను వీలైనంత విచారంగా.

'స్నేహెవరు ?.. ఇది నేహా ఫోన్నెంబరు. ఆమెకి ఇప్పుడు బాగానే వుంది. నెగిటివ్ వచ్చింది.' అతని జవాబు విని ఆశ్చర్యపోయాను.

నేను స్నేహ నెంబరుకే కదా చేసింది!!!స్నేహ అప్పటి ఫోన్నెంబరు మారిపోయిందా?
మా అబ్బాయి ద్వారా ఆవిషయం నిర్ధారణ అయింది.

--- సమాప్తం ---

కథా మంజరి



# పాత సైకిలు

## దుర్గం భైతి

"అమ్మా, సైకిలు కొనివ్వమని నాన్నకు చెప్పమ్మా " అప్పుడే బడి నుండి వచ్చిన రాజు దేవమ్మను ప్రాధేయ పడుతున్నాడు. దేవమ్మఏమిమాట్లాడలేదు. రాజు సైకిలు కొనివ్వుమని అడగడం ఈ వారంలో పదోసారి. మల్లన్నకు ఈ విషయం ఇంతవరకు చెప్పలేదు. ఆయన నుండి ఏ సమాధానం వస్తదో దేవమ్మకు తెలుసు. రాజు చెప్పిన విషయాన్ని ఏదో సాకు చూపించి వాయిదా వేసుకుంటూ వస్తుంది.

రాజుకు చిన్నప్పటి నుండి వాళ్ళ నాన్నంటే భయం. ఏది కావాలన్నా అమ్మనే అడిగేవాడు. అమ్మనే నాన్నద్వారా రాజుకు కావలసినవి ఇప్పించేది. రాజు మల్లన్నతో మాట్లాడేది చాలా తక్కువ. అవి కూడా పొడిపొడి మాటలే. అందులో ప్రేమగాని వాత్సల్యం కాని రాజుకు కనిపించేది కాదు. నెలరోజుల క్రితం రాజు పొరుగూరి సర్కారు బడిలో ఎనిమిదో తరగతిలో చేరాడు. ఆఊరికి వెళ్లాలంటే ఆరు కిలోమీటర్లు బండ్లబాటలో నడిచి వెళ్ళాలి. బస్సు రోజుకు రెండుసార్లు వెళుతుంది, కాని బడి సమయానికి రాదు.

తోటి విద్యార్థులు చాలామంది కొత్త సైకిళ్ళు కొనుక్కుని బడికి వెళ్తున్నారు. రాజు నెల రోజులనుండి నడిచే వెళ్తున్నాడు. ఎప్పుడో ఒకసారి ఒకరు లిఫ్టు ఇస్తారు. నువ్వు 'సైకిల్కొనుక్కోరా' అని ఉచిత సలహాలు ఇస్తూ, సైకిలు దిగేంతవరకు ఎగతాళి చేసేవారు. అప్పటి నుండి రాజు లిఫ్ట్ అడగడం మాని ముందుగా బయలుదేరి వెళ్తున్నాడు. ఇప్పుడు ఉపాధ్యాయులు తరగతులు బాగా చెబుతున్నారు. రెండు మూడుసార్లు బడికి ఆలస్యంగా రావడంవల్ల పాఠాలు పోతున్నవి. పైగా శిక్షకూడా విధిస్తున్నారు.

చదువంటే ప్రాణంగా భావించే రాజు మనసు, సైకిలు కొసం గుండె తల్లడిల్లుతుంది. రాజు అడిగేది పాత సైకిలే, కాని అదికూడా వారి తల్లిదండ్రులకు కష్టంగా ఉంది. కష్టమని తెలిసినా ఏదోరకంగా సర్దుబాటు చేస్తారేమోననే చిన్నఆశతో అమ్మను ప్రతిరోజు అడుగుతున్నాడు. ఈరోజు ఎలాగైనా రాజు విషయం చెప్పాలని నిర్ణయించుకుంది దేవమ్మ.

జీతం పనులు ముగించుకుని రాత్రి ఇంటికొచ్చిన మల్లన్నకు రాజు ఎదురొచ్చి

" నాన్న, నాకు సైకిల్కొనివ్వు " మెల్లగా అడిగాడు.

"నీకు చదువే దండుగనుకుంటే, సైకిలు కావాలా! "

ఎర్రబడ్డ మల్లన్న మొహం చూసి రాజు పరుగున తల్లి చాటుకెళ్ళి దాక్కున్నాడు.

"పిల్లవాడిపై ఆకోపమెందయ్యా, చూడు ఎలా భయపడుతున్నాడా?" సముదాయించేలా చెప్పబోయింది దేవమ్మ.

"వానికి, నీకు తిన్నది అరుగక, నకురాలు చేత్తున్నారు.......

వాడికి చదువెందుకని మొరమొత్తుకున్నా, నామాట వినక అలిగితివి. నాలాగా ఆసామి దగ్గర జీతముంచితే పదివేలు వచ్చేవి. ఇంత అప్పుతీరేది, అమ్మ కొడుకులు నా సంసారాన్ని ముంచుతున్నారు " కోపంగా తిట్టుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు మల్లన్న.

దేవమ్మ ఇంకేమి మాట్లాడలేదు. చాట తీసుకుని బీడీలు చేసుకుంటూ కూర్చుంది. రాజు పద్యాలు చదువుతున్నాడు. మల్లన్,దేవమ్మలకు ఇరవై ఏళ్ళక్రితం పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు. మల్లన్నది తరతరాల నుండి అసాములకు జీతము ఉండే కుటుంబం. పేదరికం అప్పుల కారణంగా మల్లన్న కూడా ఆ రొంపి నుండి బయటకు రాలేకపోతున్నాడు. దేవమ్మ ప్రతిరోజు బీడీలు చేస్తూ ఇంటిఖర్చు, బట్టలఖర్చు ఎల్లదీసేది. పోయినేడాది బిడ్డ పెళ్ళిచేసారు. అప్పుఇంకాఎక్కువైంది.

రాజు మొదటి నుండి చదువులో ఉషారుగా ఉండేవాడు. దేవమ్మ చదువుకోకున్నను, తన పిల్లలకి కష్టపడైనా చదువు నేర్పించాలని పెద్దకోరిక. అమ్మాయిని ఊరి సర్కారుబడిలో ఏడోతరగతి పూర్తికాగానే చదువు మాన్పించాడు మల్లన్న.

"అమ్మాయిని బాగా చదివిస్తే, మంచి సంబంధము తేవాలి. ఏరోజు పనిచేస్తే ఆరోజు తిండి తినే మనకు ఈచదువులొద్దు" అని మల్లన్న వాదించాడు. దేవమ్మ కొద్దిరోజులు భర్తతో పోరాడింది. చివరకు ఆయన ఆర్థికపరిస్థితిని అర్థం చేసుకుని రాజీపడింది. అమ్మాయికి బీడీలు నేర్పించింది. బీడీల కంపెనీ బందు ఉన్నప్పుడు తల్లికూతుళ్ళు పొలంపనుల్లో కూలీకోసం వెళ్లేవారు.

రాజు ఏడోతరగతి పూర్తికాగానే చదువు మాన్పించి జీతం ఉంచాలన్నది మల్లన్న ప్రయత్నం. ఈసారి దేవమ్మ వినలేదు.

"అమ్మాయి పెళ్ళి చేసాము. అప్పులు మెల్లమెల్లగా తీర్చుదాము. మీ తాత, ముత్తాతలనుండి జీతం ఉంటున్నారు. అది మీతోనే ఆఖరు కావాలి. మన రాజు బడిలో ఫస్టు వస్తున్నాడు. వాడిని ఊరందరు మెచ్చుకుంటున్నారు. బాగా చదివిద్దాము. సర్కారుబడిలో ఖర్చు ఏమి ఉండదు. అప్పుడు మీమాట విన్నాను. ఈసారి నా మాట దయచేసి వినండి"

భార్య మాటలకు అయిష్టంగానే ఒప్పుకుని రాజును పొరుగూరి పెద్దబడిలో చేర్పించి వచ్చాడు. తన ఆర్థిక పరిస్థితి గురించే ఆలోచిస్తున్నాడే కాని, దేవమ్మలా రాజు గురించి ఆలోచించడంలేదు. రాజు వల్ల అప్పు భారం తగ్గుతుందని కలకన్నాడు. ఇప్పుడు సైకిలు రూపంలో అప్పు మరింత పెరుగుతుందని కోప్పడ్డాడు.

రాత్రి పది దాటింది. రాజు నిద్రపోయాడు. మల్లన్న మెల్లగా ఇంట్లోకి వచ్చి మంచంపై పడుకున్నాడు. తాగిన వాసన వస్తుంది. దేవమ్మ తలుపులు మూసేసి వచ్చింది.

కోపం వచ్చినప్పుడు తిట్టడం, బయటకు వెళ్లి తాగి రావడం మల్లన్నకు అలవాటుగా మారింది. మల్లన్న తాగుడుకు బానిస కాదు. తన కోపాన్ని ఇలా మందు త్రాగి శాంతింప చేసుకుంటాడు. అతని బలహీనతను ఎత్తిచూపి అగౌరపరచడం భార్యగా తనకు అవమానం అని ఆరోజు ప్రశాంతంగా ఉంటుంది.

"నాన్న, అలా తాగొస్తే నువ్వు మందలించాలి కదమ్మా, మౌనంగా ఎందుకు ఉంటావు?" రాజు ఎన్నోసార్లు అడిగాడు. తను ఎప్పుడు జవాబివ్వలేదు.

తెల్లవారుజాము నాలుగు గంటలు దాటింది.

"నన్ను మన్నించు దేవి, నిన్న రాత్రి నేను అలా తిట్టకూడదు. పగలంతా ఏదోపని అలసట "

"పర్వాలేదండి. మేము రోజంతా కూర్చొనే ఉన్నాము కదా "

"అదికాదు దేవి, నువ్వు బీడీలు చేస్తూ నా అంత సంపాదిస్తున్న విషయం నాకు తెలుసు. రాత్రి అన్నం తినలేదుగా"

"మనమిద్దరం తినలేదు. చలిఅన్నం పోపుచేస్తాను. ఒకపూట కలిసివస్తుంది. మీతిట్ల వలన మనకెంత లాభం చూడండి."

"కానీ నేను మందు తాగి, ఆకలి తీర్చుకున్నాను "

"నేను నీళ్లుతాగి ......"

మల్లన్న మంచం దిగి దేవమ్మ చేతులు పట్టుకున్నాడు.

"నీ మంచితనంతో నన్ను చంపకు, ఇక తట్టుకోను. ఇకనుండి తాగను. నిన్ను ఇబ్బంది పెట్టను. వాడి మీద నాకు ప్రేమలేదనుకున్నావా? "

మల్లన్నకంటి నుండి కన్నీళ్లదారలు ఆమె అరచేతులపై పడుతున్నవి. దేవమ్మ కన్నీరు తుడుస్తూ

"మీ సంగతి నాకు తెలియదాండి, రెండేళ్ల నుండి సైకిలు అవసరమున్న మీరు జీతానికి నడుచుకుంటనే వెళ్తున్నారు.   అలసిపోయినపుడు ఆసరాగా ఉంటదని తెలిసినా, కొనే స్థోమత లేదని సైకిలు అనేది ఒకటుందని  మీరు ఎప్పుడో మర్చిపోయారు.   వాడు పసివాడు.  రోజు  అటు ఆరు ఇటు  ఆరు మైళ్లు నడిచి వెళ్తుంటే నాగుండె కలుక్కుమంటుందండి.  మనకు అప్పులు కొత్తకాదు. దేవుడిచ్చిన రెక్కలు సక్కగుంటే ఈఅప్పు తీర్చడం ఎంతసేపండి "

"నువ్వు సెప్పింది నిజమే.   వాడి అవసరం కంటే మనకుమించింది ఏముంది.  రేపే కొత్త సైకిలు కొంటాను "

"పాత సైకిలు కొనండి" దేవమ్మఅంది.

తలపై ప్రేమగా చేయితో నిమురుతుంటే రాజుకు మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు.   ఎదురుగానాన్న.

"రాజు, ఏ కంపెనీ సైకిలు కొనాలిరా " అన్నాడు

"పాతది పెద్ద సైకిలు కొను నాన్న, మనకిద్దరికీ ఉపయోగపడుతుంది!" సంతోషంగా అన్నాడు రాజు.

వారిద్దరు ఆశ్చర్యంగా  చూసారు.

* * *

# హై వే



యల్లాప్రగడ సంధ్య

డ్రైవ్ చేస్తూ రేడియో ట్యూన్ చేస్తున్నాడు మధు. హైవే మీద ఉదయము ట్రాఫిక్ బంపరు–టూ-బంపరు వుంటుంది. అరగంట ప్రయాణాన్ని గంటన్నరగా మారుస్తుంది అదే! అందుకే అంత టైము లెక్క వేసుకొని బయలుదేరాలి.. తప్పదు! రేడియో వార్తలలో వాతావరణము, ట్రాఫిక్ , హై వే దొంగతనాల గురించి వింటూ, మరోవైపు ఫోను మాట్లాడుతూ ఆఫీసుకు చేరాడు.

'గుడ్ మార్నింగు" ఎదురొచ్చిన కొలీగ్స్ కు చెబుతూ తన బ్లాక్ వైపు వెళ్ళాడు. ఆఫీసు లోపల అదో లోకము. లోపలికి వెడితే బయట ప్రపంచము గుర్తు వుండదు.

మధు కోసం కొండంత పని ఎదురుచుస్తూ వుంటుంది. ప్రాజెక్టుకు అప్రూవల్సు రావలసి వుంది. అవొస్తే మళ్ళీ రెండేళ్ళు చూడనక్కర లేదని, ప్రోగ్రామర్లని వారం నుంచి అడిగి, వాళ్లకి కావలసిన అన్ని వివరాలు ఇస్తున్నాడు. వేళాపాళా లేకుండా వాళ్ళని మధు విసిగించాడు. ఆరోజే ఓ పెద్ద ప్రాజెక్టు ప్రజెంటు చెయ్యాలి. క్లయింటు డల్లాసు నుంచి అప్పటికే వచ్చియున్నారు. ఆ రోజు ఆ హడావిడిలో టైం ఎలా గడిచిపోయిందో టీంలో ఎవ్వరికీ తెలియలేదు. అంత హడావిడి, అంత పనీ. పైపెచ్చు ఇటు టీముకు, అటు క్లయింటుకూ సంధానకర్తగా మధు పని కత్తి మీద సాము. ఆ రోజంతా హడావిడితో తల త్రిప్పి గడియారము వైపు కూడా చూడలేక పోయాడు.

మధ్యాహ్నం సుధ ఫోను "లంచ్ చేసారా" అంటూ.

"ఇంకా లేదు. మీటింగులో వున్నా!" ముక్తసరిగా చెప్పాడు మధు.

'లాకర్ కెళ్ళారా" అడిగింది సుధ. వాళ్ళ బ్యాంకు లాకరు మధు ఆఫీసు ప్రక్కనే.

అప్పుడు గుర్తుకొచ్చింది. ఉదయము సుధ 'లాకర్ లో పెట్టండి' అని తన డైమండ్ సెట్ ఇచ్చింది. అది కారు లోనే వదిలేశాడు. దారిలోనే కాల్ వస్తే, అలా మాట్లాడుతూ వచ్చేశాడు.

'ఛా!!' అనుకున్నాడు మధు. అతనికి తన మతిమరుపు మీద అతనికే చిరాకు కలిగింది.

"కుదరలేదు. విల్ టాక్ లేటర్" అంటూ ఫోను పెట్టేసి పార్కింగు లాటుకు పరిగెత్తాడు.

అతని కారు షేడ్‌లోనే వుంటుంది. బయటివారికి ఆ పార్కింగులోకి రావటానికి అవకాశం వుండదు. అయినా సరే, గబగబా వెళ్ళి వెనక సీటులో పెట్టిన జుయలరీ డబ్బాను తెచ్చి లాప్‌టాప్ బ్యాగులో కుక్కుకున్నాడు. పనిలో పడి ఆ విషయము మళ్ళీ మర్చిపోయాడు మధు.

ప్రజంటేషన్ బ్రహ్మాండంగా నడిచింది. మధుకున్న పట్టు అదే. వచ్చిన క్లయింటు జాన్సన్ మధుకు మిత్రుడే.

ప్రజెంటేషన్ బాగా సాగిందని అంతా అభినందనలు తెలిపారు. సాయంత్రం హ్యాపీ అవర్ అని అందరు కలిసి గుంపుగా ఆఫీసుకు పది మైళ్ళ దూరములో క్లబ్బుకు వెళ్ళారు.

బిజినెస్ కబుర్లతో, తిండి, ఆట పాటలతో సరదాగా గడిపాక జాన్సన్ ను హోటల్లో దింపి, ఇంటికి వెడదామని బయలుదేరారు మధు తన కారులో.

ఆ హోటలు డౌనుటౌనులో. అక్కడ దింపి, హైవే ఎక్కాలంటే కొద్దిగా షేడీగా వున్న చీకటి సందుల గుండా వెళ్ళాలి. దొంగతనాలకు మారుపేరు డౌనుటౌను.

ట్రాఫిక్ అస్సలు లేదు. జాన్సన్ ని దింపి, సన్నగా రేడియో సౌండ్ పెట్టి అక్కడ్నుంచి ఇంటి ముఖం పట్టాడు.

శీతాకాలపు చలి నెమ్మదిగా పెరుగుతోంది. సన్నటి గాలి వీస్తోంది.

మొండి చెట్లు చిన్నగా వూగుతున్నాయి.

చిన్న చీకటిని అక్కడక్కడ వున్న డిమ్ లైట్లు ఆపలేక పోతున్నాయి.

మధు అలవాటుగా కారు నడుపుతున్నాడు.

హైవే ఎక్కే లోపల అతని కారును మరో కారు ఫాలో చెయ్యటము గమనించాడు. ముందర మరో కారు నెమ్మదిగా వెడుతోంది. వేగంగా వెళ్ళటానికి ముందు కారు దారి ఇవ్వటం లేదు.

మధుకు కొద్దిగా భయమేసింది. హైవే ఎక్కితే బెటరనుకున్నా, ముందర కారు అతని కారుని ముందుకు వెళ్ళనీయ్యటము లేదు. తాను రెండు కార్ల మధ్య చిక్కుకున్నాడు.

'అసలు ఇంత లేటు అవర్స్ లో ఇలా డౌన్ టౌన్ రావటము ఎంత పొరపాటో కదూ' విసుగ్గా అనుకున్నాడు మధు.

ఇక రెండు ట్రాఫిక్ లైట్లు దాటితే హైవే ఎక్కవచ్చు, కానీ ఇంతలో రెడ్ లైటు. ముందర కారు దాటిపోయింది. మధుకు ఆగక తప్పలేదు.

మధు వెనక ఫాలో అవుతున్న కారు కూడా పక్కకే వచ్చి ఆగింది.

కారు డోరు తెరుచుకు ఎవరో దిగటము కూడా కనిపించింది. నల్లగా, దృఢంగా ఉన్నారు. వాళ్ళ చేతులలో లీలగా ఏదో, హెవీగా వున్నట్లుంది.

చీకటిలో ఏదీ సరిగ్గా కనిపించటం లేదు.

మధుకు కంగారులో ఏం చెయ్యాలో తోచలేదు.

ఆ కార్లోంచి దిగినవాడు తన కారు వైపు రావటము కూడా కనిపించింది.

అసలు ఏం జరుగుతోందో ఆలోచించటము మానేశాడు మధు. ఒక్కసారిగా సర్రున కారును ముందుకు దుముకించాడు. రియర్ వ్యూలో వెనక కారు వాడు, తిరిగి కారు ఎక్కి వెనకనే రావటము కనిపించింది. వాడు మళ్ళీ వెంట బడ్డాడు! కంగారుగా స్పీడు లిమిట్ దాటి వేగం పెంచుతూ హైవే ఎక్కేసాడు మధు. వెనకనే కారు వాడు కూడా వదలటం లేదు. వెంట పడి స్పీడు పెంచి మరీ వస్తున్నాడు.

'వీడి దుంప తెగ నన్ను వదలడా ఏంటి?' కసిగా అనుకున్నాడు మధు.

ఆ రోజు ఉదయము హైవే మీద దొంగతనాల గురించి రేడియోలో విన్న వార్త గుర్తుకు వచ్చింది.

'జీవితాలకు ఇక్కడ అసలు సేఫ్టీ లేదు' కోపంగా గొణుకున్నాడు.

'వీడిని తప్పించుకోవాలి. ఇంటి దాకా వచ్చేలా వున్నాడు వెధవ! అంతకంటే ఆఫీసు వద్ద సెక్యూరిటీ వాళ్ళ హెల్పు తీసుకోవడం బెటర్!' మనసులో గుణించుకున్నాడు. ఆ దారిలోనే తన ఆఫీసు ఉంది. అక్కడ్నుంచి మరో ఐదు కిలోమీటర్లు వెళితే గాని తన ఇల్లు రాదు. వెంటనే ఆఫీసు సెక్యూరిటీకి ఫోన్ చేసి, విషయం చెప్పాడు.

వెనకాల వాడు వేగం పెంచుతూ దగ్గర దగ్గరకు వచ్చేస్తున్నాడు.

ఇక ఆలోచించలేదు మధు. ఆఫీసు ఎగ్జిటు తీసుకొని ఆఫీసు బిల్డింగు వైపు కారుని పోనిచ్చాడు. ఆఫీసు సెక్యూరిటి ఆఫీసరును పిలుస్తూ కారు లోంచి దూకాడు. సెక్యూరిటి ఆఫీసర్ తన బెల్టుకున్న గన్ పైన చెయ్యి వేసి మధు దగ్గరగా పరుగున వచ్చాడు.

మధు వెనకనే వచ్చిన కారు సర్రున ఆగింది.

వాడి ధైర్యానికి ఆశ్చర్యపోయాడు మధు.  అందులోంచి కబ్బులో తమకు సర్వ్ చేసిన యువకుడు దిగాడు.

మధు ఆశ్చర్యకరంగా చూస్తూ 'ఇతనేమిటి ఇక్కడ' అనుకుంటూ వుండగా, మధు లాప్‌టాప్ బ్యాగు కారు లోంచి తీసాడు.

ఒక్క నిముషము ఏమీ అర్థం కాలేదు మధుకు.

ఆ బ్యాగు అతని వద్దకెలా వచ్చింది?

"మీరు ఈ బ్యాగును క్లబ్‌లో మీ టేబుల్ దగ్గర వదిలేశారు. నేను చూసి మీకిద్దామనివచ్చేసరికే మీ కారు ముందుకెళ్ళింది. మిమ్మల్ని ఫాలో చెయ్యటానికి స్పీడ్ లిమిట్ కూడా క్రాస్ చెయ్యాల్సి వచ్చింది మాన్!" అని నవ్వుతూ బ్యాగు చేతికిచ్చాడు అతను.

అప్పుడు గుర్తుకు వచ్చింది. నెక్లెస్ వుందని బ్యాగును కారులో వదలకుండా క్లబ్ లోకి తీసుకుపోయాడు. అలవాటుగా మరిచి వచ్చేశాడు.

"వావ్" ఆశ్చర్యముతో, సిగ్గుతో పాటు ఆనందం కూడిన కూతతో ముందుకు నడిచాడు మధు.

* * *

కథా మంజరి

# ఇల్లాలి ఉత్తరం

**కే.వి.ఎస్. రవి**



ఎనభై శకంలో చివరి రోజులు. ఇంకా ఉత్తరాలు రాసుకొనే రోజులే. ల్యాండ్ లైన్లు కూడా ఇంకా అందుబాటులోకి రాని రోజులు. ప్రమోషన్ మీద బదిలీ అయిన మోహన రావుకి అతని సతీమణి సుభద్ర దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఇన్లాండ్ లెటర్ కావడంతో, ఉత్తరానికున్న రెండు అంచులు చింపి చదవడం మొదలెట్టేడు.

ప్రియమైన శ్రీవారికి

మీ సుభద్ర వ్రాయునది. మీరు ఎలా ఉన్నారు. ఇక్కడ మేము,పిల్లలు, మావయ్య గారు, అత్తయ్యగారు అందరం బావున్నాము.

కిందటి శనివారం వస్తానన్నారు. ఎందుకు రాలేదు. మేమందరం ఆఖరి బస్ టైం వరకు ఎదురు చూసేము. పిల్లదయితే మీరు వచ్చేకే అన్నం తింటానని భీష్మించుకుని కూచుంది. ఎదో నోట్లో ఇంత కుక్కి నచ్చ చెప్పి దాన్ని పడుకోబెట్టాను.

పిల్లల ఇద్దరు స్కూల్ ఫీజు 10 లోగా కట్టాలి. మీరు వచ్చేక కడతారేమోనని ఎదురు చూసాను. సరే నేనైన కడదామని బయలుదేరే సమయానికి, మావయ్యగారే సిటీ బస్లో వెళ్లి కట్టేసారు. మీరు రాగానే మావయ్య గారికి డబ్బులు తిరిగి ఇవ్వండి. నేను ఇస్తే బాగోదు. పెద్ద వాడి క్వార్టర్లీ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చేరు. అన్ని ఎనభై దాటయి కానీ లెక్కల్లో డెబ్భైరెండు వచ్చేయి. నాన్న దెబ్బలాడుతాడు నువ్వే ప్రోగ్రెస్ కార్డ్ మీద సంతకం పెట్టేయమ్మ అంటున్నాడు వాడు. ఎం చేయమంటారు? చిన్నది బడికెళ్ళేటప్పుడు వీధి చివర దాకా రమ్మంటోంది. రెడ్డిగారింట్లో కుక్కని చూస్తే భయం దానికి. నాకేమో పని తెమలడం లేదు. పక్క వాళ్ల పింకీని అడుగుతాను చిన్నదాన్ని తనతో పాటు తీసుకెళ్లమని.

మొన్న, మొక్కలికి నీళ్ళు పెట్టె గొట్టం రెండు చోట్ల పగిలిపోయి నీళ్లు పైకి చిమ్ముతుంటే మావయ్య గారు గుడ్డతో గట్టిగా కట్టేరు. ఇప్పుడు ఇంక నీళ్లు కారవు లెండి. కొత్త గొట్టం మీరొచ్చినపుడు కొందురు గాని. అవును గాని, మన పెళ్లి ఫోటోకి ఫ్రేమ్ లేదా? మావయ్య గారు, షో కేస్ సర్దుతూ 'ఏమమ్మా ఒట్టి ఫోటోనే ఉంది ఫ్రేమ్ ఏదనిడిగెరు.' నాకు తెలియదు మావయ్య గారు అంటే, మన దగ్గిర పాడైపోయిన వాల్ క్లాక్లో మెషిన్ తీసేసి మన ఫోటో పెట్టేరు. ఎంత బావుందో. మన బెడ్రూంలో పెట్టాను. అత్తగారు ఈ మధ్య సనాతనసారధిలో అక్షరాలు అలుక్కుపోయినట్లు ఉన్నాయని అంటున్నారు. ఈ సారి వచ్చినప్పుడు ఒక రోజు సెలవు పెట్టుకొని రండి.. మీ అమ్మగారిని కళ్ళజోడు షాపుకు తీసుకువెళ్లుదురు గాని.

అన్నట్లు అత్తయ్యగారు నాటిన నందివర్ధనం, ఎర్ర మందారం మొక్కలు  పూయడం మొదలెట్టాయి. ఇక మన దేవుడి మందిరంలో  అందరి దేవుళ్ళకు పూలు పెట్టుకోవచ్చు.
ఈ లక్ష్మివారం బాబా గారి భజన మన ఇంటికి ఇచ్చేరు భజన సంఘం వాళ్ళు. ప్రసాదం ఏమి పెడదామని అత్తయ్యగారు అప్పుడే కంగారు పడిపోతున్నారు. కాస్త గోధుమ నూక ప్రసాదం, తాలించిన సెనగలు పెట్టేద్దాం కంగారు పడొద్దని చెప్పెను లెండి అత్తయ్యగారికి. ఆవిడ భజన ఫ్రెండ్ తులసమ్మగారు నిన్న భజనకి రాలేదట నిన్న. ఇంటికెళ్ళి చెప్పమంటున్నారు. రేపుదయం వెళ్లి చెప్పాలి.

అన్నట్టు మరిచేను. క్రితం ఏడాది మీరు పాడేరు నుంచి తెప్పించిన పిక్క తీసిన చింతపండు నిండుకొంటోంది. మళ్ళ ఆ రంగుల రాణీ బస్ డ్రైవర్కి చెప్తారా. ఇంట్లో తెచ్చి పడేస్తాడు ఎదో టైమ్లో.
ఏంటో నండి. మీరు ఇంట్లో లేకపోతే ఎంతో వెలితిగా ఉంది. నాకు రాత్రుళ్ళు సరిగ్గా నిద్ర కూడా పట్టడం లేదు. తొందరగా వచ్చేయండి బాబు.
ముఖ్యంగా ఆఫీసుకి వెళ్ళే ముందు మీరిచ్చే బుగ్గ మీద ముద్దు నాకు మళ్ళీ కావాలి. నాకు అదంటే ఎంతో ఇష్టం..
రాసి రాసి చెయ్యి నొప్పెడుతోంది. నిద్ర ముంచుకొస్తోంది.
ఇక నేనుఉంటాను.
ఇట్లు
మీ ప్రియమైన ఏవండి.
.......
ఉత్తరం చదువుకున్న మోహనరావు నవ్వుకున్నాడు. తనకి అనుకున్న చోటికే బదిలీ అయ్యింది. రెండు రోజుల్లో ఇక్కడ రిలీవు అయి తన కుటుంబాన్ని చేరుకొబోతున్నాడు. అందరికి సర్ప్రైజ్ ఇవ్వబోతు. తన సతీమణి  రాసిన ఉత్తరాన్ని ఆప్యాయంగా ముద్దు పెట్టుకొని పెట్లో భద్రంగా దాచుకున్నాడు... తీపి గుర్తులుగా మరి!!

# ఎల్లలు లేని మనసు



## పి.ఎల్.ఎస్.మంగా రత్నం

ముప్పై ఏళ్ల సర్వీసు తరువాత..  గవర్నమెంటు 'ఎడ్మినిస్ట్రేటివ్ ట్రైనింగ్' అంటూ మూడు రోజుల ట్రైనింగుకి పంపింది. ఆ ట్రైనింగు ఇంతకుముందు తీసుకున్నదే.  జిల్లా ట్రైనింగు సెంటరు మూతపడకుండా.. గ్రాంట్సు సాంక్షన్ అవ్వాలంటే, మళ్ళీ మళ్ళీ అలాంటి ట్రైనింగులు .. ఉద్యోగులకు ఇస్తూనే ఉండాలి.  పూటకో ఫాకల్టి వచ్చి పాఠాలు చెబుతుంటారు. అలాంటి పాఠాలు ఎప్పుడు విన్నా..  ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటున్నాయి.

ఈ సంవత్సరం .. రెండవ బ్యాచ్లో నాలానే రిటైరుమెంటుకి దగ్గరలో ఉన్నావాళ్ళే వచ్చారు. అలా అని ఓ నలుగురైదుగురు కొత్తగా సర్వీసు లోకి వచ్చిన వాళ్ళూ లేకపోలేదు.  అంతా పోగుచేసినా పాతిక మంది లేరు ఆ పెద్ద హాలులో.

డ్రాయింగ్ ఆఫీసర్లు విధిగా తెలుసుకోవలసిన విషయాలు వివరిస్తున్నారు.

క్లాస్ మొదలైన  గంటకి .. 'టీ' బ్రేక్ ఇచ్చారు. ఆ తరువాత  నా ప్రక్క సీటులోకి ఓ చుడీదార్ వేసుకున్న చిన్న వయసు అమ్మాయి వచ్చి కూర్చుంది.  ఎక్కడ నుంచి వచ్చిందో లేటుగా వచ్చింది. ఇంకాస్త ముందుగా వస్తే 'టీ' త్రాగేది.

మధ్యాహ్నం లంచ్ కూడా వాళ్ళే ఎరేంజ్ చేసారు. క్లాస్ కాస్త ఆలశ్యంగా ప్రారంభం కావడంతో.. ఎవరు, ఎవరన్నదీ?  పరిచయాలు లేకుండానే గడచిపోయింది.  అందరూ భోజనానికని లేస్తూ ఉంటే .. వెనుకనున్న పాలిటెక్నిక్ కాలేజీలోని  ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు  "మీరెందులో చేస్తున్నారు మేడం"  అడిగింది నా ప్రక్కన కొత్తగా వచ్చిన అమ్మాయిని ఉద్దేశించి.

జుట్టు తెల్లబడి, యాభైయ్యోపడిలో ఉన్నామె .. నిండా పాతిక సంవత్సరాలు కూడా లేని  చిన్న వయసు అమ్మాయిని 'మేడం' అని సంభోదించాలా మరీ అతిశయం కాకపోతేను అనిపించినా .. గివ్ రెస్పెక్ట్ అండ్ టేక్ రెస్పెక్ట్ పాలసీ.

"మెడికల్ అండ్ హెల్త్" చెప్పిందా అమ్మాయి.

"ఏం చేస్తుంటారు".

"మెడికల్ ఆఫీసర్"

అందరూ అటువైపు తల తిప్పిచూసారు. అలాగే నేనూను. ఇంత చిన్న వయసులోనే 'మెడికల్ ఆఫీసరా' అన్నట్లు,  ఒకింత ఆశ్చర్యంగా.

"ఎక్కడ" మళ్ళీ అడిగింది.

"జనరల్ హాస్పిటల్లో"

జనరల్ హాస్పిటల్ ఇక్కడికి చాలా దగ్గర. చక్కగా హెడ్ క్వార్టర్లో ఉద్యోగం.
భోజనం ప్లేటు తెచ్చుకుని, నా ప్రక్కనే కూర్చుంది. ఇంత చిన్న వయసులోనే 'మెడికల్ ఆఫీసర్' ఎలా అయ్యింది. ఆమె వైపు చూస్తూ "ఈ పోస్టు ఎలా వచ్చింది" అడిగాను.
"పేపర్లో నోటిఫికేషను పడింది" అడిగిన దానికే ఆచితూచి సమాధానం చెబుతుంది.
అప్పుడప్పుడూ పేపర్లో మెడికల్ నోటిఫికేషనులు పడడం తెలుసు. మా చిన్న అబ్బాయి కూడా మెడికల్ స్టూడెంటే అప్లయ్ చెయ్యరా అంటే "ఉద్యోగం కావాలంటే ఎంత సేపమ్మా! ఇప్పుడు దొరుకుతుంది ఉద్యోగం. ఇక్కడ ఉద్యోగం ముఖ్యం కాదు, చదువు ముఖ్యం" అనే వాడు. వాడి కోరిక ప్రకారం అలాగే పీ.జీ. చదువుతున్నాడు.
"మా అబ్బాయికీ చెప్పాను, వాడు అప్లయ్ చెయ్యలేదు. ఇప్పుడు పీ.జీ మెడిసిన్ చదువు తున్నాడు"
"జాబ్ వచ్చినా కూడా లీవ్ పెట్టి చదువుకోడానికి ఆప్షన్ ఉంది" చెప్పింది.
"అవును. నిజమే. వాడు పీ.జీ చదివే ఆలోచనలో ఉండిపోయాడు. ప్రస్తుతం యశోదా హాస్పిటల్స్ , మలక్ పేటలో ఉన్నాడు" చెప్పాను కాస్త గొప్పగా.
ఆమెది ఏం.బి.బి.ఎస్ మాత్రమే. అయితే ఏమిటి? ఏ చదువైనా బ్రతుకు తెరువు కోసమే.
తరువాత మూడున్నరకు 'టీ' బ్రేక్ ఇచ్చారు.
ఆ అమ్మాయి అప్పుడే హేండ్ బేగ్ తీసుకుని వెళ్ళిపోయింది.
ఆ వెళ్ళడం వెళ్ళడం .. క్రింద చెట్ల నీడకు .. నిలిపి ఉన్న ఓ తెల్ల కారుని .. రిమోట్తో ఓపెన్ చేసి, డ్రైవింగ్ సీటులో కూర్చుని, డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోవడం బాల్కనీ లోంచి చూస్తూ ఉండిపోయాం మాలాంటి పెద్ద వాళ్ళం.
"వాళ్ళకి ఇలాంటి సబ్జెక్ట్ అనవసరం! అందుకే వెళ్ళిపోతుంది" అంది కమర్షియల్ శాఖ ఆవిడ.
"ఆవిడే డ్రాయింగ్ ఆఫీసరు. ఎంత క్లర్కులు పనిచేసినా .. ఆవిడకీ సబ్జెక్ట్ తెలిసి ఉండాలి. అందుకే పిలిచారు" చెప్పాడు అక్కడే ఉన్న ఫారెస్ట్ డిపార్టుమెంటు అతను.
ఆ అమ్మాయి చిన్న వయసులో డాక్టరు అవడమే కాదు, స్వంతగా కారు నడుపుడం కూడా నాకునచ్చింది. ఈ వయసులోనే ఎంత దర్జా అయిన జీవితం. ఈరోజు ఆడపిల్లలు దేనికీ తీసిపోరు అనిపించేలా.. అప్పటినుంచి నా ఆలోచనలు .. నాకు తెలీకుండానే, ఆమె చుట్టూ తిరిగినాయి.

***

ఆ అమ్మాయి, నా ఆలోచనలు ఎంతగా మార్చేసిందంటే.. మా చిన్నవాడూ మెడికల్ లైనులోనే ఉండడం, వాడికీ పెళ్లి చెయ్యాలని .. సంబంధాలు చూస్తూ ఉండడం, ఇప్పటికే వైజాగు నుంచి చిన్నచెల్లెలు ద్వారా వచ్చిన, ఓ సంబంధం వాళ్ళు వెంట పడుతూనే ఉన్నా, పిల్లా, పిల్లాడిది ఒకే నక్షత్రం కావడంతో నేనే వెనకా ముందూ ఆడడం జరిగింది.

ఈ అమ్మాయి 'మా వాళ్ళ అమ్మాయి' అయితే బాగుండును. ఈమె ఇక్కడే ఉద్యోగంలో ఉంది కాబట్టి, హైదరాబాదులో మా పిల్లాడి కోర్సు పూర్తి అయిన తరువాత .. వాడినీ ఇక్కడికి తీసుకు వస్తే .. ఇద్దరూ కలసి ఇక్కడే .. కాకినాడలోనే .. ఉంటారు. అప్పుడు నా కొడుకు .. నా కోరిక తీరా ఉన్న ఊళ్లో.. ఉన్నట్లే ఉంటుంది. ఆ అమ్మాయి ఇంకో రెండురోజుల పాటు .. ట్రైనింగు సెంటరుకి వస్తుంది కాబట్టి, ఈ రెండు రోజులలోనూ అమ్మాయి వివరాలు తెలుసుకోవాలి. ఏమనుకుంటే అనుకుంది 'ఎవరు మీరు' అని ముఖమాటం లేకుండా అడిగేయ్యాలి. రాకెట్లు పైకి ఎగురుతున్న కాలంలోనూ.. ఈమె వెనుకబడే ఉంది అనుకున్నా ఫర్వాలేదు. ఎందుకంటే, కుల నిర్ధారణ చేసి సర్టిఫికెట్లు ఇచ్చేది మా డిపార్టుమెంటే. ఏ కులానికీ చెందని వాళ్ళు ఎవరూ ఉండరు. అంత్య నిష్టురం కన్నా ఆది నిష్టురం మేలు.

మా వాళ్ళ పిల్లే అయితే ముందుకు వెళ్ళవచ్చు. కాకపోతే, రైల్లో కలసిన పాసింజరు అనుకోవడమే. ప్రయత్నిస్తే తప్పేమీ కాదుగా. మరో రెండురోజుల తరువాత ఎవరు .. ఎవరో!

అన్నీ కలిసివస్తే, మగపిల్లాడి తల్లినైనా.. ఓ మెట్టు దిగి వెళ్లి సంబంధం కలుపుకోవాలి. అంత నచ్చింది నాకు. అలాగే తనంతట తను కారు డ్రైవ్ చేసుకోవడం కూడా ఆ అమ్మాయి నచ్చడంలో ఓ భాగమే.

అన్నీ అనుకున్నట్టే జరిగిపోతే, వైజాగు ఫోను చేసి, చిన్నచెల్లాయితో… 'దానికన్నా ముందు ఇక్కడే సంబంధం కుదిరిపోయిందిలే' అని చెప్పేద్దాం అనుకున్నా. మనసు రెక్కలు కట్టుకుని ఎగురుతుంది.

ఆ మరునాడు ..

షరా మాములే.. నిన్నటిలానే లేటుగానే వచ్చింది. తెల్లటి గౌను లాంటి డ్రస్సు వేసుకుని ఉంది. చక్కటి ముఖ వర్చస్సు. వంకీల జుట్టు. పసిమి చాయ. మెడలో సన్నటి చైను. ఆ అమ్మయినే టార్గెట్లు చేసాయి నా చూపులు.

కానీ, ఏం లాభం .. మొదటి 'టీ' బ్రేక్లోనే చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోయింది. డాక్టర్లకి ఈ ట్రెజరీ రూల్సు, పెన్షనరీ బెనిఫిట్సు ఇప్పటి నుంచే అనవసరం అనుకుంది కాబోలు.

ఉన్న రెండు రోజుల్లోనూ 'ఓ రోజు' దండగై పోయిందనిపించింది.

హాజరైన వాళ్ళ అటెండెన్ షీటు .. సంతకాల కోసం అందరికీ సర్క్యులేట్ చేసారు. సంతకం పెట్టి, షీటు అంతా ఓ సారి పరిశీలించాను. అందరి పేర్లూ .. డిపార్టుమెంట్లు చదువుతున్నాను. ఓ గడిలో 'డాక్టరు ముంతాజ్ బేగం, పీ.హెచ్.సి, బండారులంక' అని, పచ్చరంగు ఇంకుతో వ్రాసి, సంతకం చేసి ఉంది. కాస్త ఆశ్చర్యం అనిపించింది. అయినా కన్ఫర్మేషన్ కొరకు ప్రక్కనే ఉన్న పంచాయతీ రాజ్ .. ఆమెను అడిగాను. "మనతో పాటు ఎంత మంది డాక్టర్లు వచ్చారు" అని.

" ఈమె తప్ప ఎవరున్నారు? గెజిటెడ్ ఆఫీసరు కదా .. పచ్చరంగు ఇంకుతో మరీ సంతకం చేసింది" అంది.

అప్పుడు ఆ అమ్మాయి రూపం మనసులో మననం చేసుకున్నాను.

ముఖాన్న 'బొట్టు' లేదు. ఈ రోజుల్లో అమ్మాయిలు ఫేషను పేరుతొ ముఖాన్న బొట్టుకి ఇంపార్టెన్స్ ఇవ్వకపోవడం, ఇచ్చినా కనిపించీ .. కనిపించనంత చిన్నదిగా పెట్టుకోవడం, మోడరన్ డ్రస్సుల్లో ఆమెను

తెలుసుకోలేక పోయాను. అయినా ఎక్కడా మహమదీయ యాస లేకుండా చక్కటి  తెలుగు మాట్లాడడం నా మనసుని దోచింది.

జనరల్ హాస్పిటల్ అనగానే .. ఇక్కడే లోకల్ అని అనుకోవడంతో .. నా ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోయాయి.  ఎల్లలు లేని మనసు సమాధాన పడడంతో చిన్నగా చిరునవ్వు మొలిచింది పెదాల పైన

* * *

కథా మంజరి



# వినదగునెవ్వరు చెప్పిన ..

కథామంజరి " ప్రారంభ సంచిక" చదివాను. చాలా బాగుంది. అభినందనలు!
(కే. రాజగోపాల్ ఇందిర)





కథామంజరిలో కథలన్నీ బాగున్నాయి. పోటీలో గెలిచినా మూడు కథలు అర్ధవంతంగా ఉన్నాయి. స్వార్ధంతో ఎవేవోఊహించుకున్న భార్యకి, భర్త కిడ్నీదానంతోకుంచుకుపోవడం బాగా కదిలించింది. మానవ మనస్తత్వాన్ని బాగా విశ్లేషించిన కథ 'మనో వైకల్యం'. రెండో బహుమతి ఇచ్చి ఉంటే బావుండేది. ఒక సినిమా హీరో మీద కోర్టులోకేసువేయడం చాల బాగుంది. గుడ్డి అభిమానించే అభిమానులకు కనువిప్పు కలిగించిన కథ 'ఆదర్శ గ్రామం'. బహుమతికి అర్హతకలిగిన కథ. (వి. రామలింగేశ్వరరావు)

కథా మంజరి లింక్ మిత్రులు ద్విభాష్యం రాజేశ్వర రావు గారు పంపితే చూసాను. చాలా మంచి కథలు వున్నాయి. మీ అభినందనీయ ప్రయత్నం సఫలీకృతం కావాలని, తెలుగు నాట మళ్లీ మంచి కథకు పీట వేసిన మీకు శుభాభినందనలు (వెల్చేటి సుబ్రహ్మణ్యం, విశాఖపట్నం)





శ్రిమతి శశికళ వోలేటి గారి కథ చదివానండి ,చాలా బాగుంది. ప్రధమ బహుమతి గ్రహీతకు అభినందనలు (రామరాజు కలిదిండి)

కథామంజరిపదికథలు చదివేను అన్ని కథలు బాగున్నాయి ఒలెటిశశికళగారి కథ చాలా బాగుంది
(జయంతి సూర్యంబ, బెంగుళూరు)





కథా మంజరి మంచి కథల సమాహారం.కథా సాహిత్యానికి జరిగే అక్షరాభిషేకం. హృదయపూర్వక అభినందనలతో (రావుల కిరణ్మయి, హన్మకొండ)

పత్రిక చాలా బాగుంది. ద్విభాష్యం వారి కామెంట్స్ కూడా పెడితే బాగుండేది. (చాగంటి తులసి, విజయనగరం)

శుభాభినందనలు! 'కథామంజరి 'ప్రారంభ సంచిక సంపాదకీయములో ప్రస్తావించిన అన్నీ మేళవించిన మన జీవితాల్లో పెనవేసుకున్న అనుభవాల సమాహారం యువకులు తప్పకుండా చదివితీరాలి అని నా అభిప్రాయం. 'తనలో తాను – అతనితోతను' కథా రచయిత్రి ఈ కథ ద్వారా అర్ధాంగి అనే పదం కి అర్ధం తెలియచేసి అహం చేసే అనర్ధాన్ని తెలియచేసారు గ్రామాల్లో వైద్య సేవలు చేసే వైద్యుల నిర్లక్ష్యం వలన నిస్సహాయత వలన నష్టపోయిన యువకుడు వైద్యుడి గా సమాజ సేవ చేసి 'వైద్యోనారాయణో హరి :' అన్న నానుడి కి వివరణ కథ ద్వారా. విరించి బాగా తెలియ చేశారు. మనో వైకల్యం కథ ద్వారా స్వార్ధం అనర్ధహేతువు అన్న సత్యాన్ని తెలియ చేసారు రచయిత. దిద్దుకోలేని తప్పు కథ ద్వారా గ్రామాల్లో బాధ్యత గల వ్యక్తి /వుద్యోగి పరిష్కారం చేయగలిగి కూడా అలసత్వం వలన చేయలేక పోవడం వలన జరిగిన అనర్ధం ఆలోచింప చేసింది. (కొంపెల్ల శాస్త్రి, పూణే)

శర్మ గారు నమస్కారం 'కథామంజరి' మొదటి సంచిక విడుదల సందర్భంగా శుభాకాంక్షలు. వెంకటరావు గారికి కూడా నా అభినందనలు తెలుపుగోర్తాను. బాగా పేరున్న రచయితల కథలు ఉన్నాయి. తప్పకుండ అన్ని చదువుతాను. అనతి కాలం లోనే అత్యంత ప్రాచుర్యం పొందాలని కాంక్షిస్తూ..(సత్యనారాయణ సాహు, విశాఖపట్నం)

సంపాదక మహాశయులకు, 'కథామంజరి' ప్రథమ సంచిక చాలా బావుంది. కథలు మానవతా విలువల తో పాటు , మానవ సంబంధాలలోని గొప్పతనాన్ని విశదీకరిస్తూ ఎంతో ఉదాత్తంగా ఉన్నాయి. బహుమతి పొందిన కథలు మళ్ళీ, మళ్ళీ చదివించే రీతిలో అత్యుత్తమం గా ఉన్నాయి మొత్తం పది కథలూ ఆణిముత్యాలే. అందులో నా కథకు చోటు దొరకడం ...నాకెంతో ప్రోత్సాహకరంగా ఉంది. ధన్యవాదాలు (పక్కి శివ ప్రసాద్, విశాఖపట్నం)

సంపాదకులకు, నమస్కారించి వ్రాయునది అయ్యా...మీ ( మన ) ప్రారంభ సంచిక డిజైను, క్వాలిటీ చాలా బాగున్నాయి. భవిష్యత్ లో ఇంకా బాగుండాలని ఆశిస్తాను. మీకు నా శుభాకాంక్షలు.(ఎమ్. కోటేశ్వరరావు, విశాఖపట్నం)

మీరు పంపించిన 'కథామంజరి' ప్రారంభ సంచిక జులై 2020 లో అన్ని కధలు చదివాను. ప్రతి కధ కూడా ఒక 'మెచ్చు తునక' అని చెప్పాలి. కొత్త తరం రచయితలను ప్రోత్సహించడానికి, కొత్త కధలను పాఠకులకు పరిచయం చేయడానికి మీరు చేస్తున్న ఈ ప్రయత్నం తప్పకుండ సఫలం అవుతుంది. సంపాదకీయం, రాజకీయం తదితర పదాలు తెలుగులో విన్నాము. కధాకీయం పేరే కాదు విషయం కూడా కొత్తగానే ఉంది. శ్రీ ద్విభాష్యం వారు పరిచయం అవసరంలేని ప్రసిద్ధ రచయిత. విశిష్ట అతిథిగా ఈ తరం పాఠకులకు తెలియచేసిన విధానం పుస్తకానికి వన్నె తెచ్చి, అదనపు రంగును అద్దింది. అదే సమయంలో వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ కధ నిర్ణయం చేయమని బరువైన బాధ్యత ను అప్పగించి 'అగ్ని పరీక్ష' ను పెట్టినా, వారి నిర్ణయం కు అందరి ఆమోదం లభిస్తుంది. కధల గురించి చెప్పాలంటే, కొత్తతరం రచయితలు అవ్వచ్చు గాని, కధ రాసిన విధానం కొత్తగా లేదు. ఎంతో అనుభవం ఉండి చేయి తిరిగిన రచయితలు రాసినట్టు ఉన్నాయి. కధకు ఉండవలసిన కనీస లక్షణాలు అంటే వస్తువు, విషయం, శిల్పం, భావ ప్రకటన పాత తరం రచయితలకు ఏ మాత్రం తీసిపోవు. తినగా తినగా వేము తియ్యనుండు, అనగననగ రాగమతిశయించునుండు అన్న చందాన ఈ కొత్త రచయిత (త్రు)లు ఇలాగ సాధన చేసి కధలు రాస్తే ఇప్పుడున్న రచయిత(త్రు)లు రాబోయే కాలంలో వీరి నుంచి గట్టి పోటీ ఎదుర్కొనక తప్పదు.

(నిష్టల నారాయణమూర్తి, కాకినాడ)





మీ సంచికలో కనీసం రెండు కధలు పాతతరం రచయతలవి తిరిగి ప్రచురించండి. మిగిలినవి ఇప్పటి రచయితలనుంచి వచ్చినవి ప్రచురించండి. ఒక పేజీ మీ సంచిక మరియు మీరు ప్రచురించిన కధల మీద పాఠకుల స్పందన ప్రచురించండి. అన్నీ కధలు బాగున్నాయి, కానీ, 'కనువిప్పు' కథలో వయస్సులో వున్నంతకాలం సహాయము చేస్తూ మంచిపేరు తెచ్చుకున్న మాస్టారికి రిటైర్మెంట్ వయసులో కొడుకు, అల్లుడు చేత మంచితనము చేత వచ్చేనష్టాలు తెలియచెప్పడం బాగాలేదు.

(చలపతి రావు సూరంపూడి, విజయవాడ)



నిడివి పెద్దవైన కారణంగా, కొందరి పాఠకుల అభిప్రాయాలు/విశ్లేషణలను కుదించి ప్రచురించాం. గమనించమని ప్రార్ధన

# ధన్యవాదాలు



ఈ పత్రిక ఉచిత ప్రతి కోసం www.kathamanjari.in

మీ కథలను పంపించడానికి submit@kathamanjari.in

ఈ పత్రిక మీద మీ అభిప్రాయాలను, సూచనలను,

అలాగే కథల మీద అభిప్రాయాలను Info@kathamanjari.in కు ఇమెయిల్ గా

పంపవలసినదిగా కోరుతూ...

నమస్సులతో

సంపాదకుడు